Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్దతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 184 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 27 - 2 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ప్రధాని నరేంద్ర మోదీ మరో రికార్డు




**ఇంటర్నెట్ డెస్క్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో 100 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు కలిగిన తొలి రాజకీయ నేతగా సరికొత్త రికార్డును నెలకొల్పారు. 2014లో ప్రధాని మోదీ తొలిసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో చేరారు. యువతరానికి కనెక్ట్ కావడంతో ఆయన ఫాలోవర్ల సంఖ్య నాటి నుంచీ పెరుగుతూనే ఉంది. ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని మోదీ తరువాతి స్థానంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిలిచారు. ఆయనను ఇన్‌స్టాలో ఫాలో అయ్యే వారి సంఖ్య 43.2 మిలియన్‌లు. ఆ తరువాతి స్థానాల్లో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొవో సుబియాంతో (15 మిలియన్ ఫాలోవర్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డి సిల్వా (14.4 మిలియన్ ఫాలోవర్లు), తుర్కియే అధ్యక్షుడు ఎర్డొగాన్ (11.6 మిలియన్ ఫాలోవర్లు), అర్జెంటీనా ప్రెసిడెంట్ జేవియర్ (6.4 మిలియన్ ఫాలోవర్లు) ఉన్నారు. ట్రంప్‌తో పాటు ఆ తరువాత నాలుగు స్థానాల్లో ఉన్న నేతల ఫాలోవర్ల సంఖ్యను కలిపి చూసినా ప్రధాని మోదీ కంటే తక్కువగానే ఉండటం గమనార్హం. ఇక భారతీయ నేతల్లోనూ ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని నెం.1గానే ఉన్నారు. ప్రధాని తరువాతి స్థానంలో ఉన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు 16.1 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు ఉండగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఉన్న ఫాలోవర్ల సంఖ్య 12.6 మిలియన్లు. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే ప్రధాని ఇన్‌స్టా వేదికగా వివిధ అధికారిక కార్యక్రమాలు, అంతర్జాతీయ పర్యటనలు, రాజకీయ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు వివరాలను పంచుకుంటూ ఉంటారు. తన మనసులోని భావాలనూ ఫాలోవర్లతో షేర్ చేసుకుంటుంటారు.

## డయేరియా ప్రబలకుండా ఏపీ ప్రభుత్వం కీలక ఆదేశాలు




**అమరావతి, (రాజధాని వార్తలు):** మున్సిపాలిటీల్లో డయేరియా ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తల కోసం ఏపీ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. కలుషితం కాని, సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందించేలా మున్సిపల్ శాఖ ఎస్ఓకె జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీల్లో తాగునీరు కలుషితమైతే ఆయా మున్సిపల్ కమిషనర్లను ఉపేక్షించేది లేదంటూ హుకుం జారీ చేశారు. అన్ని మున్సిపాలిటీల్లో తాగునీటి పైపులైన్లు తనిఖీ చేయాలని కమిషనర్లకు దిశానిర్దేశం చేశారు. డ్రైనేజీల గుండా ఎక్కడైనా డ్రింకింగ్ వాటర్ పైప్‌లైన్లు వెళ్తున్నట్లయితే వెంటనే మార్చాలని సూచించారు. డ్రైనేజీల్లో నీరు నిలవకుండా వెంటనే చర్యలు చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు. తాగునీటిపై ఫిర్యాదులు, సీజనల్ వ్యాధులపై 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా, డ్రెయిన్ల క్లీనింగ్‌లో అశ్రద్ధ వహిస్తే మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయి సిబ్బందిని బాధ్యులను చేస్తామని స్పష్టం చేశారు. వార్డు సెక్రటరీలు, శానిటేషన్ సెక్రటరీ క్షేత్రస్థాయి తనిఖీల్లో పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. తక్షణమే ఆదేశాలు అమలయ్యేలా చూడాలంటూ మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

## ఎన్‌కౌంటర్.. ఇద్దరు మావోయిస్టులు మృతి

**ఛత్తీస్‌గఢ్:** బీజాపూర్ జిల్లాలో గురువారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోలు మృతి చెందినట్లు పోలీసు అధికారులు తెలిపారు. జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధి ఇంద్రావతి నది వెంబడి ఉన్న అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు తెలిసిందని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ క్రమంలోనే భద్రతా దళాలు, మావోయిస్టులకు చాలాసేపటి వరకూ ఎదురు కాల్పులు జరిగినట్లు ఆయన తెలిపారు. కొన్ని గంటలపాటు కొనసాగి, తర్వాత తగ్గాయని.. సంఘటనా స్థలం



నుంచి ఇద్దరు యూనిఫాం ధరించిన మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

## గోదావరి పుష్కరాలపై ఏపీ క్యాబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయాలు

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన 2027 గోదావరి పుష్కరాలపై క్యాబినెట్ సబ్ కమిటీ గురువారం సచివాలయం 5వ బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో భేటీ అయింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులు చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు కందుల దుర్గేశ్, బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజర య్యారు. ఐదు అంశాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. గత భేటీలోని అంశాలు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖలు రూపొందించిన పీపీటీలు, మంత్రుల సలహాలు, సూచనలు తదితర అంశాలపై చర్చించింది. మహా కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించాలని క్యాబినెట్ సబ్ కమిటీ భావించింది. 8 నుంచి 10 కోట్ల మంది ఈ పుష్కరాలకు వస్తారని క్యాబినెట్ సబ్ కమిటీ అంచనా వేస్తోంది. 2027 జూన్ 26వ తేదీ నుంచి జులై 7వ తేదీ వరకు జరిగే గోదావరి పుష్కరాలను 6 జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. 4516 మీటర్ల మేర 373 ఘాట్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలకు అంచనా వేసింది. గతంలో ఉన్న 234 ఘాట్ల సంఖ్య పెంపునకు చర్యలు చేపట్టింది. పుష్కరాల ప్రధాన రోజుల్లో (తొలి, వీకెండ్, అమావాస్య) దాదాపు కోటి మంది వస్తారని అంచనా వేసింది. పవిత్ర స్నానానికి 2.25 కోట్ల మంది వస్తారని అంచనా వేసింది. భక్తుల సౌకర్యార్థం పిండ ప్రదానం ఘాట్లు, శానిటేషన్ ప్రక్రియ, రోడ్లు, వాటర్



తదితర విషయాల్లో పక్కా ప్రణాళిక ఉండాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సాధారణ ధరలకే టెంట్ సిటీలు, హోమ్ స్టేలు ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్‌తో క్యాబినెట్ సభ కమిటీ చర్చించింది. ఈస్ట్ గోదావరిలో 102 ఘాట్లు, వెస్ట్ గోదావరి 40, కోనసీమ 175, ఏలూరు 36, కాకినాడ 5, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు.. మొత్తంగా 369 ఘాట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఏపీలో మొదటి గోదావరి పుష్కర ఘాట్ పోలవరం జిల్లాలో గుండాల, చివరి ఘాట్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలో గోవలంక ఘాట్, వెస్ట్ గోదావరిలో నర్సాపురం ఘాట్ అని కమిటీ వెల్లడించింది. భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలని నిర్ణయం తీసుకుంది. శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్లను నియమించాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది.

## చిన్నారుల భద్రత కోసం పటిష్ట చర్యలు : డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా



**అమరావతి, (రాజధాని వార్తలు):** సురక్షిత బాల్యంతోనే సుస్థిర భవిష్యత్తు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. ఏపీ వ్యాప్తంగా 'ఆపరేషన్ చిన్నారి తల్లి' ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన 'ఆపరేషన్ చిన్నారి తల్లి' పోస్టర్‌ను మంగళగిరి డీజీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడారు.

**లైంగిక నేరాల నివారణే లక్ష్యంగా చర్యలు..**

చిన్నారులపై లైంగిక నేరాల నివారణే లక్ష్యంగా చర్యలు చేపట్టామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. పోక్సో కేసుల్లో జీరో పెండెన్సీ – 60 రోజుల్లో ఛార్జ్‌షీట్లు, స్పీడ్ ట్రయిల్ మానిటరింగ్ ద్వారా శిక్షల శాతం పెంచుతున్నామని తెలిపారు. తరచూ లైంగిక నేరాలకు పాల్పడే వారిపై సెక్సువల్ ఆఫెండర్స్ షీట్స్ నమోదు చేస్తున్నామని స్పష్టం చేశారు. సున్నిత ప్రాంతాల్లో పటిష్టమైన రాత్రి గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలలు, అంగన్వాడీలు, హాస్టళ్లలో 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్'లపై అవగాహన కార్యక్రమాలు... చిన్నారుల తల్లులను అప్రమత్తం చేస్తున్నామని వివరించారు. బాధితులకు కౌన్సిలింగ్, పునరావాస సహాయం కల్పిస్తున్నామని చెప్పు కొచ్చారు. మహిళలు, చిన్నారుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు.

## శాసన మండలిలో నియంతలా బొత్స వ్యవహారం : పంచుమర్తి అనురాధ


**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ నేతలపై శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కౌన్సిల్‌లో వైసీపీ సభ్యులు అనేక నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం సమాధానం చెబుతుంటే అడ్డుకుంటున్నారన్నారు. బడ్జెట్ సెషన్ అంతా గాలికి వదిలేసి చర్చ జరగకుండా చేశారని విమర్శించారు. ప్రశ్నోత్తరాలు కూడా జరగకుండా అడ్డుకున్నారని అనురాధ అన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను సమాధానం ఇవ్వనీయకుండా నియంతలా ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. స్వల్పకాలిక చర్చను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించాల్సి ఉందని.. మంత్రి స్టేట్‌మెంట్ ఇవ్వడానికి వీలు లేదని.. ముందు తామే మాట్లాడతామని వైసీపీ నేతలు పట్టుబట్టారని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యం అనుకుంటున్నారా రాజారెడ్డి రాజ్యాంగం అనుకుంటున్నారా అని



ప్రశ్నించారు. వైసీపీ సభ్యుల ఆందోళనలతో మండలి ఛైర్మన్ సభను శుక్రవారంకి వాయిదా వేశారని తెలిపారు. ప్రశ్నోత్తరాలు జరపమని ఛైర్మన్‌ను అడిగితే వైసీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సహా మరికొందరు మీదకు వస్తున్నారన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మీదకు వైసీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ వస్తుంటే మంత్రులు వెళ్ళి అడ్డుకున్నారని చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ పేర్కొన్నారు.

## న్యాయవ్యవస్థలో అవినీతి పేరిట పాఠ్యాంశం!
## ఎన్‌సీఈఆర్‌టీ బుక్‌పై సుప్రీం కోర్టు నిషేధం

**ఇంటర్నెట్ డెస్క్:** 'న్యాయవ్యవస్థలో అవినీతి' పాఠ్యాంశాన్ని 8వ తరగతి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకంలో చేర్చడాన్ని సుప్రీం కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సీఈఆర్‌టీ బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేసింది. 'మరింత లోతైన విచారణ జరగాలి. బాధ్యులు ఎవరో తేలాలి. వారు మూల్యం చెల్లించుకోవాల్సిందే. కేసును మేము క్లోజ్ చేయము" సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అంతేకాకుండా, భారత్‌తో పాటు విదేశాల్లోనూ ఆ పుస్తకాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రతులను వెంటనే సీజ్ చేయాలని పేర్కొంది. ఆన్‌లైన్‌లో కూడా ఆ పుస్తకాన్ని విక్రయించడంపై నిషేధించింది. అటు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎన్‌సీఈఆర్‌టీ ఛైర్మన్‌కూ నోటీసులు జారీ చేసింది. అంతకు ముందు, సొలిసిటర్ జనరల్ తన వాదనలు వినిపిస్తూ ఈ ఉదంతానికి బాధ్యులైన వారు ఇకపై ఎన్‌సీఈఆర్‌టీతో పాటు ఏ మంత్రిత్వ శాఖతో కలిసి పనిచేయబోరని తెలిపారు. తమ మద్దతు న్యాయవ్యవస్థకేనని అన్నారు. బాధ్యులు ఎవరూ తప్పించుకోలేరని హామీ ఇచ్చారు. అయితే, ప్రధాన న్యాయమూర్తి మాత్రం ఈ చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ చర్యలతో ఎలాంటి ఫలితం ఉండదని అన్నారు. 'వారు తొలి తూటాను పేల్చారు. న్యాయవ్యవస్థకు గాయమైంది. రక్తం కారుతోంది. దీని వెనుక ఏదో లోతైన కుట్ర ఉన్నట్టు అనిపిస్తోంది. పక్కా ప్లాన్ ప్రకారం చేసినట్టు ఉంది' అని అన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ తాజాగా క్షమాపణలు చెప్పిన తీరుపై కూడా చీఫ్



జస్టిస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అంశంలో అనుకోకుండా పొరపాటు జరిగిందని ఎన్‌సీఈఆర్‌టీ తన ప్రకటనలో పేర్కొంది. సరైన నిర్ణయం తీసుకోనందుకు విచారిస్తున్నామని వ్యాఖ్యానించింది. అయితే, న్యాయస్థానం మాత్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. తాము ఆశించిన స్థాయిలో క్షమాపణ లేదని పేర్కొంది. ఈ విషయాన్ని తుషార్ మెహతా ప్రస్తావిస్తూ విచారణ మొదట్లోనే తాము బేషరతుగా క్షమాపణ చెబుతున్నామని అన్నారు. అయితే, ఆయన కామెంట్స్‌తో చీఫ్ జస్టిస్ విభేదించారు. ఎన్‌సీఈఆర్‌టీ ప్రకటనపై మీడియా కథనాలను ఉటంకిస్తూ ఆ ప్రకటనలో క్షమాపణ అన్న పదమే లేదని పెదవి విరిచారు. ఈ అంశంపై బుధవారం కేంద్ర ప్రభుత్వ వర్గాలు కూడా స్పందించాయి. సంబంధిత పాఠ్యాంశాన్ని తొలగిస్తామని పేర్కొన్నాయి. ఈ పాఠానికి బదులు స్ఫూర్తిమంతమైన ఇతర కథనాలు చేర్చి ఉండాల్సిందని అభిప్రాయపడ్డాయి.

## ఏపీలో లైన్‌మెన్ నియామకాలపై మంత్రి గొట్టిపాటి కీలక ప్రకటన

**అమరావతి, (రాజధాని వార్తలు):** లైన్‌మెన్‌ల నియామకంపై ఏపీ శాసన మండలిలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మండలి సభ్యులు, ఆలపాటి రాజా, కావలి గ్రీష్మ, బీటీ నాయుడు అడిగిన ప్రశ్నకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమాధానం ఇచ్చారు. నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం క్షేత్ర స్థాయి సిబ్బంది చాలా అవసరమని తెలిపారు. క్షేత్రస్థాయి విద్యుత్ అవసరాల కోసం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లో నియమించుకున్నా మని వివరించారు. 18 వేల మంది మూడు డిస్కంల పరిధిలో వివిధ పద్ధతుల్లో నియామకమై పని చేస్తున్నారని అన్నారు. 5580 మంది ఎనర్జీ అసిస్టెంట్‌లకు ట్రైనింగ్ ఇచ్చి వారి సర్వీసులను ఉపయోగించుకుంటామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వెల్లడించారు. ఏఈల కొరతపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, నియామకాలను త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ఆర్డీఎస్ఎస్ పనులు చేపడుతున్నామన్నారు. ఆర్డీఎస్ఎస్ ద్వారా ఫీడర్ బైఫరికేషన్ చేసి వ్యవసాయానికి నిరంతరాయ విద్యుత్ ఇస్తామని తెలిపారు. ఆర్డీఎస్ ఎస్ పనుల కోసం సుమారు రూ. 8 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. 70 శాతం ఆర్డీఎస్ఎస్ పనులు ఇప్పటికే పూర్తి చేశామని వివరించారు. ఏప్రిల్ నాటికి వంద శాతం ఆర్డీఎస్ఎస్ పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. విశాఖపట్నంలో తుఫాను లను తట్టుకునేందుకు అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ నిర్మిస్తున్నామని వెల్లడించారు. వరదల సమయంలో డిస్కంలకు అతీతంగా సిబ్బంది పని చేసి అంతరాయాలు లేకుండా చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు.

# ఖజురహో నృత్య ఉత్సవం సంస్కృతిని సాహసంతో మిళితం చేస్తుంది : స్కైడైవింగ్ నుండి హెరిటేజ్ మారథాన్ వరకు







**మధ్యప్రదేశ్:** ఫిబ్రవరి 20 నుండి 26, 2026 వరకు జరిగిన 52వ ఖజురహో నృత్య ఉత్సవం, సంస్కృతి, సాహసం మరియు లీనమయ్యే పర్యాటక అనుభవాల అసాధారణ సంగమాన్ని చూసింది. యునెస్కో ప్రపంచ వారసత్వ దేవాలయాల నేపథ్యంలో ఏర్పాటు చేయబడిన మంత్రముగ్ధమైన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో పాటు, అనేక రకాల పర్యాటక కార్యకలాపాలు వారం రోజుల వేడుకకు ఒక ఉత్తేజకరమైన కొత్త కోణాన్ని జోడించాయి. మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డుతో సమన్వయంతో నిర్వహించబడిన ఈ కార్యకలాపాలు భారతదేశం మరియు విదేశాల నుండి సందర్శకుల నుండి ఉత్సాహభరితమైన భాగస్వామ్యాన్ని పొందాయి. ఖజురహో డైనమిక్ సాహస మరియు అనుభవపూర్వక పర్యాటక కేంద్రంగా ఆవిర్భావాన్ని బలోపేతం చేశాయి. సాహస సమర్పణలలో భాగంగా జిన్నా మరియు మాడ్లా గ్రామాలలోని పన్నా నేషనల్ పార్క్ సమీపంలో క్యాంపింగ్ అనుభవాలను నిర్వహించారు. పర్యాటకులు ప్రకృతి మధ్య రాత్రి పూట బస చేస్తూ, బహిరంగ ఆకాశం కింద అరణ్య ప్రశాంతతను అనుభవిస్తున్నారు. స్కైడైవింగ్ హైలైట్ ఆకర్షణగా ఉద్భవించింది, సందర్శకులలో, ముఖ్యంగా యువత పాల్గొనే వారిలో అపారమైన ఉత్సాహాన్ని సృష్టించింది. ఖజురహో విమానాశ్రయంలో 10,000 అడుగుల ఎత్తు నుండి టెన్డం జంప్‌లు ఈ ప్రాంతం యొక్క అసమానమైన అడ్రినలిన్ రష్ మరియు విశాల దృశ్యాలను అందించాయి. ఫిట్‌నెస్ మరియు వారసత్వ స్ఫూర్తికి తోడు, ఫిబ్రవరి 22న హెరిటేజ్ మారథాన్ నిర్వహించబడింది, ఇందులో 21 కి.మీ, 10 కి.మీ మరియు 5 కి.మీ రేసు విభాగాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో గణనీయమైన భాగస్వామ్యం ఉంది. రన్నర్లు ఖజురహో యొక్క చారిత్రాత్మక ప్రకృతి దృశ్యాన్ని జరుపుకునే సుందరమైన మార్గాల్లో ప్రయాణించారు. లోతైన సాంస్కృతిక నిశ్చితార్థాన్ని కోరుకునే వారికి, ఖజురహో విలేజ్ టూర్, ఇ-సైక్లింగ్ టూర్ మరియు ప్రత్యేకమైన "వాక్ విత్ పార్థి" చొరవ వంటి క్యూరేటెడ్ అనుభవాలు స్థానిక సమాజాలతో అర్థవంతమైన పరస్పర చర్యలను అందించాయి. ఈ కార్యకలాపాలు గ్రామీణ జీవితం, స్వదేశీ సంప్రదాయాలు మరియు ఈ ప్రాంతం యొక్క జీవన సాంస్కృతిక నిర్మాణంపై అంతర్దృష్టులను అందించాయి. కుట్నీ ద్వీపంలో జల క్రీడల కార్యకలాపాలు రోజంతా పనిచేస్తూ, పండుగ యొక్క వినోద ఆకర్షణను మరింత పెంచాయి.

**బుందేలి వంటకాలు మరియు స్థానిక కళల కేంద్ర వేదిక**

ఉత్సవ వేదిక బుందేల్‌ఖండ్ యొక్క గొప్ప రుచులను స్వయం సహాయక బృందాలు నిర్వహించే ఆహార దుకాణాల ద్వారా ప్రదర్శించింది, ఇక్కడ సందర్శకులు ప్రామాణికమైన బుందేలి వంటకాలను ఆస్వాదించారు. గ్రామీణ పర్యాటక మరియు నైపుణ్య అభివృద్ధి విభాగం హస్తకళలు మరియు సావనీర్‌లను ప్రదర్శించే స్టాళ్లను ఏర్పాటు చేసింది, ఇవి ప్రధాన ఆకర్షణలుగా మారాయి. టెర్రకోట కళ, బుందేలి పెయింటింగ్ మరియు పూసల ఆభరణాల తయారీ యొక్క ప్రత్యక్ష ప్రదర్శనలు పర్యాటకులకు స్థానిక చేతిపనులను ప్రత్యక్షంగా చూడటానికి మరియు చేతివృత్తుల వారితో నేరుగా పాల్గొనడానికి అవకాశాన్ని కల్పించాయి. విస్తృత ప్రచారం మరియు సందర్శకుల నిశ్చితార్థాన్ని నిర్ధారించడానికి, సమాచార కేంద్రంలో ప్రదర్శన ప్యానెల్‌లను ఏర్పాటు చేశారు, బ్రోచర్‌లను పంపిణీ చేశారు మరియు నగరంలోని ప్రముఖ హోటళ్లలో స్టాండీలను ఉంచారు. సాంస్కృతిక వైభవం, పర్యాటక ఆవిష్కరణ మరియు సాహస కార్యకలాపాల సజావుగా మిశ్రమం ఈ సంవత్సరం ఖజురహో నృత్య ఉత్సవాన్ని ఒక విలక్షణమైన వేడుకగా గుర్తించింది - ఇక్కడ వారసత్వం థ్రిల్‌ను కలుసుకుంది మరియు సంప్రదాయం సమకాలీన అనుభవాలను స్వీకరించింది.

# ఈనెల 26వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ శ్రీ తల్పగిరి రంగనాయకుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఉత్తర శ్రీరంగంగా పేరుగాంచిన నెల్లూరు జిల్లా ప్రజల ఆరాధ్య దైవం శ్రీ తల్పగిరి రంగనాథ స్వామివారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు జిల్లా రెవెన్యూ అధికారి అనూష తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుపై ఆర్డీవో ఆధ్వర్యంలో ఆలయంలో బుధవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ అనూష మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో ముఖ్యంగా మార్చి 2వ తేదీ ఆదివారం రాత్రి హనుమంత సేవ, 3వ తేదీ బంగారు గరుడ సేవ, 4వ తేదీ కళ్యాణోత్సవం, 5వ తేదీ రథోత్సవం, 6వ తేదీ తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. రథోత్సవం, తెప్పోత్సవం రోజుల్లో వేలాదిగా విచ్చేసే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయవలసిందిగా అధికారులకు సూచించారు. దేవాలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని అలాగే క్యూ లైన్‌లో ఉన్న భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పించవలసిందిగా మున్సిపల్ అధికారులను కోరారు. అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాల్సిందిగా విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. దేవాలయం ఎదురు రోడ్డులో వాహనాల నియంత్రణకు, అలాగే క్రౌడ్ మేనేజ్మెంట్‌కు తగినంత పోలీస్ సిబ్బందిని నియమించాలన్నారు. శాఖల వారీగా చేపట్టాల్సిన విధులపై ఆమె సమీక్షించారు. నగర ఇన్చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనల మేరకు ఫెస్టివల్ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఫెస్టివల్ కమిటీనే ఆలయ కమిటీగా నియమిస్తూ త్వరలోనే అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నట్లు చెప్పారు. ఆలయంలో జరిగే అన్ని ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు ఆలయ అభివృద్ధికి కూడా నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు. మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి ఇద్దరు కూడా రంగనాథ స్వామి ఆలయాన్ని అత్యద్భుతంగా భక్తుల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్దంగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నెల్లూరు కార్పొరేషన్ పక్షాన బ్రహ్మోత్సవాల విజయవంతానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఇంచార్జ్ మేయర్ చెప్పారు. అనంతరం ఫెస్టివల్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన లెక్కల వెంకారెడ్డిని, కమిటీ సభ్యులను ఈవో శ్రీనివాసులు రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సమీక్షలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి కోవూరు జనార్దన్ రెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిజం తెలుసుకో రూప్.. నీ డూప్ మాటలు చెల్లవు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలకు చెందిన పిల్లలకు మెను ప్రకారమే స్నాక్స్ సప్లై చేశామని కాంట్రాక్టర్ సిరాజ్ పేర్కొన్నారు. ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ చేస్తున్న ఆరోపణలు అసత్యమని స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూప్ కుమార్ చేసిన విమర్శలను ఆయన తిప్పి కొట్టారు. ఇంకా ఎంతకాలం చిల్లర రాజకీయాలు చేస్తావు ఉంటూ రూప్ కుమార్ పై మండిపడ్డాడు. నిజం తెలుసుకో రూప్.. నీ డూప్ మాటలు చెల్లవంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రెస్ మీట్‌లో కేవలం బోండాలు, బజ్జీలు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. నీకు అవసరం అయితే పాఠశాలల హెడ్-మాస్టర్ దగ్గరకు వెళ్లి నిజాలు తెలుసుకోవాలని సూచించారు.

అధికారులు వర్క్ ఆర్డర్ ఇస్తేనే దాని ప్రకారం కాంట్రాక్టర్ వర్క్ చేస్తారు ఇది ఒక ప్రక్రియ...పేద విద్యార్థులకు నిజాయితీగా మెనూలో ఉన్నవన్నీ మరియు లేనివి కూడా పేద పిల్లల కోసం సప్లై చేసామన్నారు. అంతేగాని ఇలాంటి నీచ రాజకీయాలు మానుకోవాలని హితవు చెప్పారు.

# 'జస్టిస్ అన్‌ప్లగ్డ్' - చట్టానికి సంబంధించిన కొత్త సవాళ్లను పరిశీలించనుంది

**చెన్నై:** 'జస్టిస్ అన్‌ప్లగ్డ్ 2026', ది హిందూ, VIT చెన్నై సంయుక్త కార్యక్రమం, ఫిబ్రవరి 28న న్యూఢిల్లీలో జరుగనుంది. ప్రారంభ సమావేశంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయన్, సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, మరియు వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వ్యవస్థాపకుడు, చాన్సెలర్ జి. విశ్వనాథన్ పాల్గొననున్నారు. మొదటి చర్చ జెన్-AI వల్ల కలిగే సాంకేతిక మార్పులపై జరుగుతుంది. VIT వైస్ ప్రెసిడెంట్ జి.వి. సెల్వం, ది హిందూ గ్రూప్ జజుూ ఎల్.వి.నవనీత్‌తో భారతదేశంలో న్యాయ విద్య యొక్క ప్రస్తుత స్థితిపై సంభాషిస్తారు. మధ్యాహ్నం 'డిజిటల్ యుగంలో ప్రాథమిక హక్కులు' అనే అంశంపై సెషన్ జరుగుతుంది. రాజ్యాంగ ఆలోచన కళను అన్వేషించే సెషన్‌లో సీనియర్ అడ్వొకేట్, మాజీ ఒరిస్సా హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎస్. మురళీధర్ పాల్గొంటారు. చివరి ప్యానెల్ 'న్యాయాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకు రావడం' అనే విషయంపై దృష్టి సారిస్తుంది. సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, ది హిందూ గ్రూప్ డైరెక్టర్ ఎన్.రామ్ రాజ్యాంగ నైతికత, సుప్రీంకోర్టుపై లోతైన చర్చ జరుపుతారు. -పై కంటెంట్ The Hindu వార్తాపత్రిక నుండి అనువాదం చేయబడింది.

# పేదల సొంత ఇంటి కల నెరవేర్చండి

**- విజిలెన్స్ విచారణలతో కాలయాపన చేయకుండా పేదలకు ఇళ్లు దక్కేలా తక్షణ చర్యలు చేపట్టాలి - భూసేకరణ పేరుతో కొంత, ల్యాండ్ డెవలప్‌మెంట్ పేరుతో మరికొంత మొత్తాన్ని గత పాలకులు దోచుకుంటే.. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండానే కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసుకున్నారు - గత ప్రభుత్వ తప్పిదాల వల్ల పేదల సొంత ఇంటి కల కలగానే మిగిలిపోయింది : శాసనసభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** గత ప్రభుత్వ తప్పిదాల వల్ల పేదల సొంత ఇంటి కల కలగానే మిగిలి పోయిందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. శాసనసభ సమావేశాలలో పేదల పక్కా ఇళ్ల సమస్యపై ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ అవినీతిపై ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ విషయంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, అవకతవకల వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గ్రామీణ ప్రాంతాలలోని క్షేత్రస్థాయి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. భూసేకరణ పేరుతో కొంత మొత్తం, ల్యాండ్ డెవలప్‌మెంట్ పేరుతో మరికొంత మొత్తాన్ని గత పాలకులు దారి మళ్లించారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆరోపించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండా కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసుకున్నారని నియోజకవర్గ పరిధిలో వేలాదిగా పునాది దశలోనే ఆగిపోయిన అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల గురించి ఆమె సభలో ప్రస్తావించారు. నియోజకవర్గ పరిటాల పర్యటనలకు వెళ్ళినప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు తమకు ఇల్లు కావాలని కోరుతున్నారని ఆమె తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు సంతోషంగా ఉన్నప్పటికీ ఈ గృహనిర్మాణ సమస్య మాత్రం వారిని వేధిస్తోందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఎన్నిసార్లు చర్చించుకున్నా పేదల ఇళ్ల సమస్య మాత్రం కొలిక్కి రావడం లేదని విజిలెన్స్ విచారణలతో కాలయాపన చేయకుండా పేదలకు ఇళ్లు దక్కేలా తక్షణ చర్యలు చేపట్టాలి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల పక్షాన నిలబడి యుద్ధ ప్రాతిపదికన పక్కా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా ఒక స్పష్టమైన పరిష్కారం కనుగొనాలని ఆమె గృహ నిర్మాణ శాఖ మంత్రి కి సూచించారు. బడుగు బలహీన వర్గాల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేయాలని కోరారు.

# జనన, మరణ నమోదులో పలు నియమాలు

**- జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జనన-మరణాల నమోదు చట్టం 1969 యొక్క సెక్షన్ 30 ద్వారా ప్రదతమైన అధికారాలను వినియోగించి కేంద్ర ప్రభుత్వం అనుమతితో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 1999 నాటి ఆంధ్రప్రదేశ్ జనన - మరణాల నమోదు నియమాలను రద్దు చేసి 2025 జనన మరియు మరణాల నమోదు నియమాలు. ఆంధ్రప్రదేశ్ గజిట్ నోటిఫికేషన్ ప్రచురణ ద్వారా తేదీ 17.02.2026 నుండి పలు నియమాలు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జనన, మరణాల నమోదు నిమిత్తం అమల్లోకి వచ్చిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి, జనన మరణ ప్రిన్సిపల్ రిజిస్టర్ డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్ బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియ జేశారు. ప్రభుత్వం పొందుపరిచిన నియమాలు కానీ, జరిగిన జననం/ మరణములు, పుట్టిన /మరణించిన తేదీ నుండి 21 రోజులలో ఉచితంగా నమోదు చేస్తారని, ఇంటి వద్ద కానీ, ఆసు పత్రిలో గాని జరిగిన జనన మరణములు పుట్టిన/ మరణించిన తేదీ నుండి 21 రోజుల నుండి 30 రోజుల్లోపు రూ.25/- ఆలస్య రుసుం చెల్లించి నమోదు చేసుకోవాలని, 30 రోజుల నుండి ఒక సంవత్సరంలోపు రూ. 250/- ఆలస్య రుసుము చెల్లించి నమోదు చేసుకోవచ్చని, ఒక సంవత్సరము తర్వాత రూ. 500/- ఆలస్యం రుసుము చెల్లించి నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. పుట్టిన బిడ్డ జననం నమోదు చేసిన తర్వాత ఒక సంవత్సరంలోపు ఉచితంగా శిశువు పేరును నమోదు చేసుకునే అవకాశం ఉందని, ఒక సంవత్సరం నుండి 15 సంవత్స రాలలోపు రూ. 250/- ఆలస్య రుసుము చెల్లించి శిశువు పేరును నమోదు చేసుకోవచ్చన్నారు. జనన మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయుటకు లేదా లభ్యత లేని ధ్రువపత్రాలు (non availability certificate) కొరకు జననం మరణం శోధన చేసేందుకు ఒక సంవత్సరమునకు రూ. 50/- చెల్లించి నాన్ అవైలబిలిటీ సర్టిఫికేట్ పొందవచ్చునని, అదనపు సంవత్సరం శోధన చేయుటకు రూ. 25/- రూపాయలు చెల్లించి non availability certificate పొందవచ్చునని తెలిపారు. ప్రతి జనన లేదా మరణముకు సంబంధించిన ధ్రువపత్రం పొందుటకు జీవీఎంసీ సౌకర్యం కౌంటర్ లో రూ. 50/- చెల్లించి రసీదుతో పాటు సంబంధిత డాక్యుమెంట్లను కూడా జత పరిచి జనన మరణ ధ్రువీకరణ పత్రం పొందవచ్చునని ప్రధాన వైద్యాధికారి తెలిపారు.

# "ప్రపంచ వేదికపై విశాఖ ప్రతిభ"

## - వాతావరణ మార్పుల ప్రతిఘటనకు 1 మిలియన్ అమెరికన్ డాలర్ల Bloomberg Philanthropies మేయర్ చాలెంజ్‌లో గ్లోబల్ గ్రాంట్ గెలుచుకున్న విశాఖ - V-PULL జీవీఎంసీకి ఒక మోడల్‌గా నిలిచింది : జివిఎంసి కమిషనరు కేతన్ గార్గ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ ప్రతిష్టాత్మకమైన Bloomberg Philanthropies 2025-2026 మేయర్స్ చాలెంజ్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైన 24 నగరాల్లో ఒకటిగా నిలిచిందని, ఈ విజయంతో విశాఖ నగరానికి 1 మిలియన్ అమెరికన్ డాలర్ల గ్రాంట్‌తో పాటు సాంకేతిక మరియు కార్యాచరణ సహాయం అందనుందని జివిఎంసి కమిషనరు కేతన్ గార్గ్ బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా కమిషనరు వివరిస్తూ.., V-PULL జీవీఎంసీకి ఒక మోడల్‌గా నిలిచిందని, విశాఖ నగరం వరదలు, తుఫానులు, తీవ్ర ఉష్ణ తరంగాల ప్రభా వాన్ని తగ్గించేందుకు ప్రజలతో కలిసి వినూత్న పరిష్కారాలను ఆవిష్కరించిన ప్రత్యేక పౌర భాగస్వామ్య కార్యక్రమం ద్వారా అంతర్జాతీయ గుర్తింపు పొందిందని, ఈ కార్యక్రమం "విజాగ్-ప్రజాముఖి అర్బన్ లివింగ్ ల్యాబ్ (V-PULL)" పరిధిలో అమలవుతూ, ప్రజాకేంద్రీకృత విధానం, వాతావరణ ప్రతిఘటన సామర్థ్యం మరియు హైపర్-లోకల్ కమ్యూనిటీ భాగస్వామ్యంపై దృష్టి సారిస్తోందని కమిషనరు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 630కు పైగా దరఖాస్తుల మధ్య విశాఖపట్నం ప్రత్యేక ప్రతిభ కనబరిచి ఈ విజయాన్ని సాధించిందని, ప్రారంభ దశలో టాప్-50 ఫైనలిస్టులలో స్థానం సంపాదించిన జీవీఎంసీకి 50,000 అమెరికన్ డాలర్ల సీడ్ ఫండింగ్ మరియు సాంకేతిక సహాయం లభించిందన్నారు. ఆ సహాయంతో స్థానిక స్థాయిలో పైలట్ ప్రాజెక్టును అమలు చేసిందని, పైలట్ దశలో జీవీఎంసీ వార్డు స్థాయి కమ్యూనిటీ సమావేశాలు నిర్వహించి, హైపర్-లోకల్ సెన్సింగ్ వ్యవస్థలు, డేటా ఆధారిత నిర్ణయ సాధనాలను పరీక్షించిందన్నారు. అలాగే ప్రజల భాగస్వామ్యంతో వాతావరణ ప్రతిఘటన, విపత్తు సిద్ధత చర్యలను అమలు చేసి, పౌరులు మరియు మునిసిపల్ విభాగాల మధ్య సమర్థవంతమైన ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను నెలకొల్పిందని, నగర పరిపాలనలో ప్రజల భాగస్వామ్యంతో తీసుకున్న వినూత్న చర్యలకు లభించిన ఈ అంతర్జాతీయ గుర్తింపు గర్వకారణమని కమిషనరు తెలిపారు. "విశాఖ నగరాన్ని Bloomberg Philanthropies 2025-2026 మేయర్స్ చాలెంజ్ విజేతగా ఎంపిక చేయడం జివిఎంసికి ఎంతో గౌరవం లభించదన్నారు. ప్రజల భాగస్వామ్యంతో, ప్రాంగణ స్థాయిలో పరీక్షించిన వినూత్న పరిష్కారాలతో నగరాలు మార్పుకు నాయకత్వం వహించగలవనే మా నమ్మకానికి ఇది మరింత బలాన్ని చేకూర్చింది," అని పేర్కొన్నారు. ఈ 1 మిలియన్ అమెరికన్ డాలర్ల గ్రాంట్‌ను బాటమ్-అప్ విధానాన్ని బలోపేతం చేయడానికి, విపత్తు సిద్ధతను మెరుగుపరచడానికి, ఈ కార్యక్రమాలను నగరంలోని మరిన్ని వార్డులకు విస్తరించడానికి వినియోగించనున్నట్లు కమిషనరు తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించడంలో ధైర్యంగా, సృజనాత్మకంగా మరియు ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి స్పందించే నగర పాలక సంస్థలే అత్యంత సమర్థవంతమైనవి. మరిన్ని నగరాలు విజయం సాధించేందుకు మేయర్స్ చాలెంజ్‌ను ప్రారంభించామని Michael R. Bloomberg, Bloomberg Philanthropies స్థాపకుడు, New York City మాజీ మేయర్ పేర్కొన్నారని కమిషనరు తెలిపారు. రాబోయే నెలల్లో జీవీఎంసీ ప్రత్యేక ఇన్నోవేషన్ అమలు బృందాన్ని ఏర్పాటు చేసి, పైలట్ కార్యక్రమాలను మరిన్ని వార్డులకు విస్తరించనుందని, అలాగే విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ రంగంతో భాగస్వామ్యాలను బలోపేతం చేయనుందని, విశాఖపట్నం ఈ గ్లోబల్ వేదికను Rio de Janeiro, Barcelona, Toronto, Cape Town, Budapest, Medelln మరియు Belfast వంటి ప్రముఖ అంతర్జాతీయ నగరాలతో పంచుకుంటోందని కమిషనరు తెలిపారు.

# "వక్త-2026" పోటీలలో గూడలి హైస్కూల్ విద్యార్థి నాగ శరత్‌కి ద్వితీయ బహుమతి







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డా.జివికె మెమోరియల్ నెల్లూరు ఆసుపత్రి ప్రాంగణంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన "వక్త -2026" జిల్లా స్థాయి పోటీలలో కోట మండలం, గూడలి హైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి విద్యార్థి ఆశం నాగ శరత్ పాల్గొని జిల్లా స్థాయిలో "ద్వితీయ" బహుమతి గెలుపొంది, మెమెంటో మరియు మూడు వేల రూపాయలు క్యాష్ ప్రైజ్‌ను నెల్లూరు నగర కమీషనర్ నందన్ చేతులు మీదుగా బహుమానం అందుకోవడం జరిగిందని గూడలి హైస్కూల్ హెడ్ మాస్టర్ డాక్టర్ మస్తాన్ చేమూరు వారు తెలియజేశారు. కోట మండల స్థాయిలో తృతీయ స్థానం పొందిన నాగ శరత్, జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం పొందడం ఆనందంగా ఉందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. గ్రామీణ నేపథ్యం గల విద్యార్థి,జిల్లా స్థాయిలో రాణించేందుకు తర్ఫీదు ఇచ్చిన, హెడ్ మాస్టర్, సైన్స్ టీచర్ శంకరమ్మతో పాటు ఉపాధ్యాయులందరినీ గ్రామస్తులు అభినందించారు. గూడలి హైస్కూల్ విద్యార్థులు భవిష్యత్‌లో రాష్ట్ర స్థాయిలో ఇంకా ఎన్నో బహుమతులు పొందాలని వారు ఆకాంక్షించారు.

# ఘనంగా మరుపల్లి ఎల్లమ్మ జాతర

## - అమ్మవారి జాతరకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిన ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని మరుపల్లి గ్రామంలో ఎల్లమ్మ జాతర ఘనంగా జరిగింది. బుధవారం రెండో రోజు భక్తుల తెల్లవారుజాము నుంచి క్యూ లైన్‌లో నిలబడి ఎల్లమ్మ తల్లి, పరుశురామన్నలను దర్శించుకున్నారు. భక్తులు ఎటువంటి అసౌకర్యానికి లోను కాకుండా నిర్వాహకులు సర్పంచ్ లెంక రామలక్ష్మి, ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది పటిష్ట చర్యలు చేపట్టడంతో అమ్మవారి భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారు. అలాగే సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన సిరిమానోత్సవం వైభవంగా జరిగింది. సిరిమాను దర్శనం కోసం గజపతినగరం, దత్తరాజేరు, బొండపల్లి మండలాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పూజారి కర్ణకోట సత్యనారాయణ సిరిమాను అధిరోహించి మూడు పర్యాయాలు చుట్టూ తిరగగా, భక్తులు అరటిపళ్ళు విసిరుతూ సిరిమాను దర్శనం చేసుకున్నారు.

# అమలాపురం రెస్టారెంట్లో పాడైన ఆహారం

## - వాసన కొడుతున్న ఆహారం వీడియో - సోషల్ మీడియాలో సెండ్ చేసి తీవ్ర అగ్రహం వ్యక్తం చేసిన కస్టమర్ - ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు ఎందుకు తనిఖీలు నిర్వహించడం లేదంటూ ఆగ్రహం - ఏ బి సి ఫుడ్ కోర్ట్‌లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించిన ముస్లిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్





**అమలాపురం, (రాజధాని వార్తలు):** అధికారులు ఎన్నిసార్లు తనిఖీలు నిర్వహించినా, జరిమానాలు విధించినా రెస్టారెంట్ల తీరు మాత్రం మారడం లేదు. ఓ ప్రక్క పాలు కల్తీ జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోయిన సంఘటన మరువకముందే రెస్టారెంట్లలో కుళ్ళిన ఆహారం ఇలా ఎక్కడ చూసిన నిర్లక్ష్యపు నీడలే. డబ్బే పరమావధిగా ప్రజల ప్రాణాల తో చెలగాటమాడుతున్న రెస్టారెంట్లు నిత్యం ఎక్కడో ఒకచోట కనిపిస్తూనే ఉన్నాయి. అధికారులు ఎన్నిసార్లు తనిఖీలు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన వారి తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదు. తాజాగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం గడియారం స్తంభం సెంటర్ దగ్గర్లో గల ప్రముఖ రెస్టారెంట్లో కుళ్ళిన మాంసంతో తయారు చేసిన బిర్యాని వడ్డించడంపై ఓ కస్టమర్ ఆవేదన వ్యక్తం చేస్తూ కుళ్లిన వాసన పుడుతున్న ఆహారాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా తీవ్ర సంచలనంగా మారింది. తనకు వడ్డించిన బిర్యానిలోని చికెన్ పీసులు కుళ్ళిన వాసన కొడుతున్నాయని ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు ఎందుకు నిర్వహిం చడం లేదని కస్టమర్ ఆ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ వీడియో వైరల్‌గా మారడంతో రెస్టారెంట్‌ను తనిఖీ చేయాలని అమలాపురం మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ ఆదేశించారు.గడియాల స్తంభం సెంటర్ సమీపంలోని ఏ బి సి ఫుడ్ కోర్ట్ రెస్టారెంట్లో తనిఖీలు నిర్వహించిన ఫుడ్ సేఫ్టీ అధికారులు నిల్వ ఉన్న ఆహార పదార్థాలను గుర్తించామని పది వేల రూపాయల జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. మరో సారి ఇలా జరగకుండా నిబంధనలు పాటించాలని అతిక్రమిస్తే అనుమతులు రద్దు చేస్తామని అధికారులు తెలిపారు. అయితే విధించిన పదివేల రూపాయలు ఆ రెస్టారెంట్‌కు లెక్కే కాదని కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. హోటల్లు, రెస్టారెంట్లలో నాణ్యత లేని ఆహారాన్ని, నిలువ ఉన్న, పాడైన ఆహారాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుని అనుమతులను రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# కిక్ బాక్సింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించిన నీహారిక



**అమలాపురం, (రాజధాని వార్తలు):** న్యూఢిల్లీలోని కెడి జావేద్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ కప్-20 పోటీలలో రామచంద్రపురానికి చెందిన కారు మూరి లేఖా నీహారిక అద్భుత ప్రతిభ కనబరిచి రెండు బంగారు, ఒక రజత పతకాలను సాధించి అంబేద్కర్ కోనసీమ జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ వేదికపై రెపరెపలాడించింది. లేఖా నీహారిక లైట్ కాంటాక్ట్ విభాగంలో రెండు బంగారు పతకాలను గెలుచుకోగా, క్రియేటివ్ ఫామ్ వెపన్ విభాగంలో ఒక రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఆమె ప్రతిభకు గుర్తింపుగా బెంగళూరులో నిర్వహించనున్న కేలో ఇండియా సౌత్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపింది. ఈ సందర్భంగా లేఖా నీహారిక డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డా.ఆర్. మహేష్ కుమార్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం అభినందనీయమని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. లేఖా నీహారిక విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, కోచ్‌లు బికె రత్నం, అంజనీ కుమార్‌లను జిల్లా కలెక్టర్ అభినందించారు.

# ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

## - తహశీల్దార్ సి హెచ్ వెంకటలక్ష్మి పిలుపు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పార్టీలు సహకరించాలని తహశీల్దార్ సి హెచ్ వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. పెద్దాపురం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలనే అంశంపై ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ వెంకటలక్ష్మి చెప్పారు. ఈ సందర్భంగా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం కోసం ముందస్తు ప్రణాళికలు, డూప్లికేట్ ఓటర్ల గుర్తింపు వంటి ముఖ్య అంశాలపై సమగ్రంగా చర్చించారు. అలాగే ఓటరు జాబితాలో ఎటువంటి లోపాలు లేకుండా ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయడం అత్యంత అవసరమని తహశీల్దార్ సూచించారు. ప్రతి రాజకీయ పార్టీ తమ పరిధిలోని పోలింగ్ బూత్‌లకు బూత్ లెవెల్ ఏజెంట్లను నియ మించుకోవాలన్నారు. బూత్ స్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి, డూప్లికేట్ నమోదు, మరణించిన ఓటర్ల వివరాలు, మార్పులు-చేర్పులు వంటి అంశాలను వెంటనే అధికారులకు తెలియజేయాలని పార్టీల నాయకులను కోరారు. సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా సాగేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అధికారులు కూడా అందరి సమన్వయంతో ఎన్నికల నిర్వహణను విజయవంతం చేయాలని వారు కోరారు.

# సంపాదకీయం

## సమాఖ్య పాలనపై కొత్త సంవాదం

మన గణతంత్ర రాజ్యం ఇప్పుడు పలు క్లిష్ట పరిస్థితుల నెదుర్కొంటున్నది. పర్యావరణ సంక్షోభాలకు పరిష్కారాలు, సంప్రదాయ వృత్తి విద్యలకు కొత్త శక్తినివ్వడం, ప్రత్యామ్నాయ విద్య, సమర్థమైన ఆరోగ్య భద్రతా విధానాలు, స్మార్ట్ ఐటీ క్లస్టర్స్, వ్యాపారాలలో కొత్త పద్ధతులు మొదలైన విషయాలలో సమస్త భారతీయుల ఉమ్మడి భవిష్యత్తుకు ఉపయుక్తమైన కొత్త భావాలు, నమూనాలు, ప్రయోగాలు దక్షిణ భారతావని నుంచే ప్రభవిస్తున్నాయి. అలాగే రాజకీయ వ్యవహారాలపై అధునాతన చర్చలూ దక్షిణాదిలోనే ప్రారంభమవుతున్నాయి. భారత దేశ సమాఖ్య పాలనా పద్ధతిపై ప్రస్తుత పరిస్థితులలో చాలా అవసరమైన సంభాషణను తమిళనాడు ప్రారంభించింది. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి గురించి ఎవరూ మాట్లాడని రోజులలో ఆ భావనను ప్రతిపాదించి, సమర్థించిన రాజమన్నార్ కమిటీ (1969—71) స్ఫూర్తితో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం గత ఏడాది కేంద్రం—రాష్ట్రాల సంబంధాలపై ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన నియమితమైన త్రిసభ్య కమిటీ కొద్ది రోజుల క్రితమే ఒక నివేదికను సమర్పించింది. భారత దేశ సమాఖ్య పాలనా పద్ధతిపై శ్రద్ధాసక్తులు ఉన్నవారందరూ ఆ నివేదికను చదివి, చర్చించాల్సిన అవసరమున్నది. రాజమన్నార్ కమిటీ సూచనలను పునరుద్ఘాటించేందుకు లేదా వాటిని తాజాగా ప్రతిపాదించేందుకే ఈ నివేదిక పరిమితం కాలేదు. భారత రాజ్యాంగం నిర్దేశించిన సమాఖ్య పాలనా పద్ధతిని మెరుగుపరిచేందుకు పలు నిర్దిష్టమైన ప్రతిపాదనలను ప్రజల పరిశీలనకు నివేదించింది. సరళంగా చెప్పాలంటే ఒక కొత్త సమాఖ్య ఒప్పందం లేదా భారత సమాఖ్యవాద నిర్మాణాత్మక పునర్వ్యవస్థీకరణకు జస్టిస్ కురియన్ కమిటీ నివేదిక విజ్ఞప్తి చేసింది. కేంద్ర—రాష్ట్ర సంబంధాల విషయమై మన రాజ్యాంగం నిర్దేశాలు కేంద్రీకరణ వైపే ఎక్కువగా మొగ్గాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎందుకలా జరిగింది? దేశ విభజన అల్లకల్లోల పరిస్థితులలో కొత్త స్వతంత్ర దేశం ఎదుర్కొన్న అవస్థలు రాజ్యాంగ రచనకు పూనుకున్న మన నాయకులను అమితంగా కలవరపరిచాయి. తత్కారణంగానే కేంద్రానికి ఎక్కువ అధికారాలు కల్పించారు. నాటి అల్లకల్లోల పరిస్థితులు పూర్తిగా సమసిపోయినప్పటికీ అధికారాల కేంద్రీకరణ ఒక వారసత్వ అలవాటుగా మిగిలిపోయింది. ఇది కొత్త రాజకీయ పరిస్థితుల ఆధారంగా తీసుకున్న ఆలోచనాత్మక నిర్ణయం ఎంత మాత్రం కాదు. ఇది మన ప్రజాస్వామిక పాలనలో ఒక తిరోగమనం, సందేహం లేదు. 1990ల్లో ప్రాంతీయ పార్టీల ప్రాభవ ప్రాబల్యాలు, కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఆ తిరోగమనాన్ని అడ్డుకోవడంలో విఫలమయ్యాయి. గత దశాబ్దంలో పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. కేంద్రంలోని ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా, తమ భావజాల స్ఫూర్తితో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి తీవ్ర విఘాతం కలిగించడంతో కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో ఇబ్బందికరమైన అసమతుల్యతలు నెలకొన్నాయి. ఆర్థిక వ్యవహారాలలో, పాలనాపరమైన విషయాలలో అధికారాల కేంద్రీకరణ మరింతగా పెరిగింది. రాష్ట్రాలను సమాన భాగస్వాములుగా కాకుండా మునిసిపాలిటీల స్థాయి పాలనా విభాగాలుగా పరిగణించే ధోరణులు పెరిగిపోయాయి. దేశ పాలనలో సమాఖ్య స్ఫూర్తి బాగా క్షీణించిపోయింది. 'తనలో భాగంగా ఉన్న రాష్ట్రాలను పూర్తిగా విశ్వసించే, వాటి సమ భాగస్వామ్యాన్ని గౌరవించే, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించే సమాఖ్య వ్యవస్థ దేశ సార్వభౌమత్వాన్ని బలహీనపరచదుబీ ప్రజాస్వామ్యాన్ని ప్రగాఢమూ, విశాలమూ చేస్తుంది అని జస్టిస్ కురియన్ కమిటీ నివేదిక పేర్కొంది. అటువంటి సమాఖ్య వ్యవస్థ సమైక్యంగా సుస్థిరంగా ఉండడమనేది 'ఆదేశించడం కాకుండా ఏకాభిప్రాయ సాధనతో నిర్ణయాలు తీసుకోవడం వల్ల, భాష మొదలైన విషయాలలో ఆధిపత్యానికి ఆస్కారం లేకుండా సంప్రదింపులతో సర్దుబాట్లు చేసుకోవడం వల్ల, అధికారాల కేంద్రీకరణతో కాకుండా వాటి సూత్రబద్ధ పంపిణీతో సాధ్యమవుతుందని జస్టిస్ కురియన్ నివేదిక పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై ఏ భావి సంభాషణ అయినా ఈ అవగాహనతోనే ప్రారంభమవ్వాలి. భారత సమాఖ్యవాదం పాలనా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల శాసన, పాలనా అధికారాలలో జోక్యం చేసుకుంటోందని, ఆర్థిక రంగంలో కూడా అదే ధోరణి స్పష్టంగా కనిపిస్తోందని జస్టిస్ కురియన్ నివేదిక వాదించింది. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు వివిధ రంగాలలో సంస్కరణలు తక్షణావశ్యకమని అభిప్రాయపడింది. ముందుగా రాష్ట్రాల సరిహద్దులను మార్చడం అంటే రాష్ట్రాల ప్రాదేశిక పునర్వ్యవస్థీకరణలో కేంద్ర ప్రభుత్వ అధికారాలకు పరిమితి ఉండాలని, రాజ్యాంగాన్ని సవరించడంలో రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్రం నిర్ణయాలు తీసుకోకూడదని ఆ నివేదిక స్పష్టం చేసింది. ఆర్థిక రంగంలో 1991 ఆర్థిక సంస్కరణలతో పోల్చదగిన స్థాయిలో కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో సమతుల్యతను పునఃసాధించాలని జస్టిస్ కురియన్ కమిటీ నివేదిక కోరింది. విద్యను ఉమ్మడి జాబితా నుంచి తొలగించి మళ్లీ రాష్ట్ర జాబితాలో చేర్చాలని, రాష్ట్రాల అధికార పరిధిలోని ఆరోగ్య భద్రత, వ్యవసాయం తదితర రంగాలలో కేంద్ర ప్రభుత్వ చొరబాటును అడ్డుకోవాలని కూడా జస్టిస్ కురియన్ కమిటీ పేర్కొంది. రాజకీయ వ్యవస్థల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి గవర్నర్లు తమ విధ్యుక్త ధర్మ నిర్వహణలో పక్షపాత వైఖరితో నిర్ణయాలు తీసుకోవడాన్ని అడ్డుకునేందుకు రాజ్యాంగబద్ధమైన చర్యలు చేపట్టాలని సూచించింది. రాజకీయ ప్రాతినిధ్యం పునర్వ్యవస్థీకరణపై ప్రతిపాదనలు 'ఒకే దేశం, ఒకే ఎన్నిక భావనను నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి. ఇది పూర్తిగా సబబే. ప్రజనన రేట్లు స్థిరీకృతమయ్యే దాకా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణను వాయిదా వేయాలని జస్టిస్ కురియన్ కమిటీ సూచించింది.

# అంగరంగ వైభవంగా "వాసుపల్లి" వారి పెళ్లి సందడి

### - ఒక్కటైన వాసుపల్లి సాకేత్, శ్రావణిల జంట



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** అతిరథ మహారథులు తరలి వచ్చారు. నాయకుల నుంచి కార్యకర్తల వరకు అభిమానుల నుంచి ప్రజలు వరకు తరలివచ్చి తమ అభిమానాన్ని చూపించి, నూతన వధూవరులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. తమ ప్రియతమ నాయకుడు, పేదల పెన్నిధి, అందరికీ ఆప్తులు, నిస్వార్థ సేవకుడు, విశాఖ దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రెండో కుమారుడు వివాహ రిసెప్షన్ కన్నుల పండువుగా జరిగింది. ఈ పండుగకు వెలంపేటలో గల జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వేదిక అయింది. మంగళవారం రిసెప్షన్ కాగా బుధవారం ఉదయం 10.11 నిమిషాల ముహూర్తాన ఆ జంట ఒకటయ్యారు. స్పీకర్‌తో సహా రాజకీయాలకు అతీతంగా పలువురు ఎంపీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు, పలువురు ఉన్నతాధికారులు, అధికారులు వివాహ వేడుకలకు హాజరయ్యారు. తదితర పెద్దలతో సహా జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ తదితర ప్రముఖులు హాజరై దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. ముందుగా జరిగిన రిసెప్షన్ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా పలు రకాల ఉత్తరాది, దక్షిణ వంటకాలతో ఏర్పాటు చేసిన విందు అందరిని కనువిందు చేసింది. వాసుపల్లి గణేష్ కుమార్ స్వయంగా తన కుమారుడి వివాహానికి హాజరు కావాలంటూ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, మీడియా ప్రతినిధులకు, మీడియా సంస్థలకు ఆహ్వానాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు వివిఐపీలు, వీఐపీలు, పలు రాజకీయ పార్టీల నాయకులు, వైసిపి శ్రేణులు పాల్గొనడం జరిగింది. వచ్చిన ప్రతి ఒక్కరూ పెద్ద మనసుతో నూతన వధూవరులను మనసారా ఆశీర్వదించడం జరిగింది. దీంతో వేదిక వద్ద పండుగ వాతావరణం నెలకొంది. ఉత్సాహ వాతావరణంలో ఈ కార్యక్రమం ఆద్యంతం జరిగింది. తన కుమారుని రిసెప్షన్, వివాహ వేడుకలకు కు హాజరై మంచి మనసుతో ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఈవిఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి





**నెల్లిమర్ల, (విజయనగరం), (రాజధాని వార్తలు):** స్థానిక ఈవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. గోదాము షట్టర్లకు వేసిన సీళ్లను, తాళాలను పరిశీలించారు. పోలీసు బందోబస్తుపై సమీక్షించారు. సిసి కెమేరాల ద్వారా చుట్టుప్రక్కల పరిస్తితులను పరిశీలించారు. సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

ఈవీఎం గోదాము తనిఖీ కార్యక్రమంలో నెల్లిమర్ల తాహసీల్దార్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ప్రసాదరావు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


# విజయవంతమైన ఉచిత వైద్య-శిబిరం

**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్వామి కంటి ఆసుపత్రి వారు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు ఆదేశాల మేరకు 22వ డివిజన్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు రౌతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దక్కినవీధి శ్రీ సీతారామ మందిరం వద్ద కోవై ఆర్థోకేర్ మరియు కంటి వైద్య శిబిరం స్వామి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో విజయవంతంగా చేపట్టారు. ఈ వైద్యశిబిరాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు పిళ్లా విజయ్‌కుమార్ ప్రారంభించారు. తొలుత కార్యక్రమాన్ని అవనాపు విజయ్ జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ వైద్యశిబిరంలో ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ రంజిత్ వివేకానంద, కంటి వైద్యనిపుణులు డాక్టర్ రవళి ఉచిత వైద్య సేవలు అందించారు.



ఆసుపత్రి పి ఆర్ ఓ బాబ్జీ పర్యవేక్షణలో జరిగిన ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు ఎద్ద ఎత్తున పాల్గొని సద్వినియోగం చేసుకున్నారు.

# విశాఖలో దారుణం... భార్యను గొంతు నులిమి చంపిన భర్త



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆరిలోవ బాలాజీ నగర్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. భార్యపై పెంచుకున్న అనుమానంతో ఓ వ్యక్తి ఆమెను చున్నీతో గొంతు నులిమి కిరాత కంగా హత్య చేశాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం బాలాజీ నగర్‌కు చెందిన దుర్గ (33), ఆమె భర్త బురదపాటి దేముడు (42) ఇద్దరూ నగరంలోని లైఫ్ స్టైల్ షోరూమ్‌లో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. కొంతకాలంగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న దేముడు, మంగళవారం ఉదయం ఆమెతో గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఆగ్రహంతో ఊగిపో యిన అతడు, దుర్గ మెడకు చున్నీతో గొంతు నులిమి హత్య చేశాడు. కుమార్తె నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అను మానం వచ్చిన తండ్రి నర్సింహులు ఇంటికి వెళ్లి చూడగా, తలు పులు లోపల నుంచి వేసి ఉన్నాయి. తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా, దుర్గ మెడపై గాయాలతో విగతజీవిగా పడి ఉంది. సమాచారం అందుకున్న ఆరిలోవ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. హత్య చేసిన అనంతరం నిందితుడు దేముడు తప్పించుకోకుండా ఇంట్లోనే ఫ్రిడ్జ్ వెనుక దాక్కున్నాడు. అయితే, ఇంటి బయట అతడి బైక్ ఉండటంతో పోలీసులు ఇంట్లోనే గాలించగా నిందితుడు దొరికి పోయాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ కేసుపై సీఐ మల్లేశ్వరరావు పూర్తిస్థాయి దర్యాప్తు జరుపు తున్నారు.

# లండన్‌లో పెద్దాపురం యువకుడు మృతి



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** లండన్‌లో తెలుగు యువకుడు మృతి చెందాడు. ఆ యువకుడు పెద్దాపురం కొండయ్యపేటకు చెందినవాడుగా గుర్తించారు. పెద్దాపురం పట్టణం కొండయ్యపేటకు చెందిన అభిషేక్ (26) లండన్‌లో తను ఉంటున్న నివాసములో అకస్మాత్తుగా మంటలు వ్యాప్తి చెంది దట్టమైన పొగలు అలుము కోవడంతో ఊపిరాడక మృతి చెందినట్టు అక్కడి పోలీసులు చెప్పారని కుటుంబీకులు చెప్పారు. క్రోయ్‌డాన్‌లోని డప్పాస్ హిల్ టెర్రస్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో అభిషేక్ మృతి చెందాడు. 2023లో యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ యునైటెడ్ కింగ్డమ్‌లో ఎంబీఏ చేసేందుకు అభిషేక్ లండన్ వెళ్లాడు. ఈ సంఘటనలో ఇంట్లో ఉన్న యువకుల్లో ఒక యువకుడు బ్రతికి బయట పడగా మరో యువకుడు కూడా మృతి చెందినట్టు సమాచారం. కాగా మృతుడు అభిషేక్ తండ్రి బాస్కరరావు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఉద్యోగుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. అభిషేక్ మృతితో కొండయ్య పేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# క్రియ పిల్లల పండుగలో బ్రౌన్ పేట విద్యార్థులకు బహుమతి




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఈ నెల 22వ తేదీ పెద్దాపురం నియోజకవర్గ స్థాయిలో పెద్దాపురంలో జరిగిన క్రియ పిల్లల పండుగ కార్యక్రమంలో గ్రూప్ పాటల పోటీలలో విభాగంలో సామర్లకోట బ్రౌన్ పేట మునిసిపల్ మోడల్ ప్రైమరి పాఠశాల 4వ తరగతి విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారు. 4వ తరగతి తెలుగు వాచకంలోని "వీరగంధం తెచ్చినారు" గీతానికి ద్వితీయ బహుమతిని వారు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వీరన్న మాట్లాడుతూ బ్రౌన్ పేటలో చదువు తున్న పిల్లల్లో అద్భుతమైన ప్రతిభ దాగి ఉందని వారు తరగతిలో చాలా చురుకుగా ఉంటారని, వారిలో సహజ సిద్ధంగా వున్న ప్రతిభ పాటవాలకు పాఠశాలలో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు భాద్యత తీసుకుంటే దేశం గర్వపడే ఉత్తమ పౌరులుగా అటు కుటుంబానికి, ఇటు సమాజానికి తోడ్పాడే మానవ వనరులుగా రూపంతరం చెందగల రని అన్నారు. బహుమతిని గెలుచుకున్న గీతానికి స్వరకల్పన చేసిన ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత దేవగుప్తాపు వీరన్నను, బహుమతి సాధించిన విద్యార్థులను పాఠశాల హెడ్ మాస్టర్ కంచర్ల గుప్తా, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# తక్కువ ఫీజుతో పేద, మధ్యతరగతికి "మెడికవర్" వైద్యం




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రస్తుత కాలంలో ప్రతివారికి వైద్య సేవలు ముఖ్యం అటువంటి వైద్య సేవలు పేద, మధ్యతరగతి వారికి కూడా అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో మెడి కవర్ ఆసుపత్రిలో అతి తక్కువ ధరలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, మెడికొవర్ ముఖ్య కార్య నిర్వాహణాధికారి నందికొళ్ల అంజిబాబులు అన్నారు. ఆసుపత్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్య అతిధిగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికోవర్ ఆసుపత్రి ద్వారా ఇప్పటి వరకు అంతుచిక్కని వ్యాధులకు సైతం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో విజయాలు సాధించినట్టు చెప్పారు. అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు అనుభవం ఉన్న వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రధా నంగా పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ఫీజులతోనే వైద్యసేవలు అందించేందుకు నిర్ణయించినందున ప్రజలు ఆసుపత్రి సేవలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా ప్రముఖులు కుండల సాయిబాబు, కాళ్ల ధనరాజు, తుమ్మల పల్లి నాని, మారే బుజ్జి తదితరులు పాల్గొని వైద్య పరీక్షల పోస్టర్ను ఆవిష్కరించారు.

# రూ.102 కోట్ల గోల్డ్ స్మగ్లింగ్ కేసు.. రన్యా రావుకు ఈడీ ఛార్జ్‌షీట్ షాక్!



బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్ట్ అయి, దాదాపు ఏడాదిగా జైలులో ఉన్న కన్నడ నటి రన్యా రావుకు మరో పెద్ద షాక్ తగిలింది. తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బెంగళూరులోని పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టులో సమగ్ర ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తూ ఆమె పేరును ప్రధాన నిందితుల జాబితాలో స్పష్టంగా ప్రస్తావించింది. ఈ పరిణామం కేసు దర్యాప్తును మరింత తీవ్ర దశకు తీసుకెళ్లినట్టు భావిస్తున్నారు. ఈడీ దాఖలు చేసిన వివరాల ప్రకారం, దుబాయ్ కేంద్రంగా పనిచేసిన ఒక సిండికేట్ ముఠా ద్వారా భారీ స్థాయిలో బంగారం అక్రమ రవాణా జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొత్తం రూ.102 కోట్ల విలువైన సుమారు 127 కేజీల బంగారాన్ని దుబాయి నుంచి ఇండియాకు అక్రమంగా తరలించినట్లు దర్యాప్తు సంస్థ పేర్కొంది. ఈ స్మగ్లింగ్ వ్యవహారంలో రన్యా రావు కీలక పాత్ర పోషించినట్టు, ఆమె నెట్‌వర్క్ అంతర్జాతీయ లింకులు కలిగి ఉన్నట్టు ఈడీ తన ఛార్జ్‌షీట్‌లో వివరించింది. గతేడాది మార్చి 3న 14.2 కేజీల బంగారాన్ని అక్రమంగా తరలించే ప్రయత్నంలో ఆమె పోలీసుల అదుపులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఆ అరెస్టు తర్వాత కస్టమ్స్, డీఆర్ఐ సంస్థల దర్యాప్తు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో కేసును ఈడీ స్వీకరించింది. స్మగ్లింగ్ ద్వారా వచ్చిన నిధులను హవాలా మార్గంలో చలామణి చేయడం, వాటిని రియల్ ఎస్టేట్ మరియు ఇతర వ్యాపారాలలో పెట్టుబడులుగా మలచిన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పీఎంఎల్‌ఏ చట్టం కింద నమోదైన ఈ కేసులో ఆస్తుల స్వాధీనం, బ్యాంక్ లావాదేవీల ఫ్రీజింగ్ వంటి చర్యలు ఇప్పటికే ప్రారంభమైనట్లు సమాచారం. సిండికేట్‌లో పాల్గొన్న ఇతర వ్యక్తులపై కూడా విచారణ కొనసాగుతోందని అధికారులు చెబుతున్నారు. విదేశీ ప్రయాణాలు, తరచూ జరిగే ట్రాన్సాక్షన్లు, షెల్ కంపెనీల ద్వారా నిధుల మార్పిడి వంటి అంశాలను ఈడీ ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. సినీ రంగానికి చెందిన వ్యక్తి ఇంత పెద్ద స్థాయిలో ఆర్థిక నేర ఆరోపణలు ఎదుర్కొనడం కలకలం రేపుతోంది. ఒకప్పుడు గ్లామర్ ప్రపంచంలో గుర్తింపు తెచ్చుకున్న రన్యా రావు పేరు ఇప్పుడు మనీలాండరింగ్, స్మగ్లింగ్ కేసులతో వార్తల్లో నిలవడం చర్చనీయాంశంగా మారింది. కేసు కోర్టులో విచారణ దశలో ఉండటంతో తుది తీర్పు వెలువడాల్సి ఉంది. అయితే ఈడీ దాఖలు చేసిన తాజా ఛార్జ్‌షీట్ కేసు దిశను ప్రభావితం చేసే అవకాశముందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి. మొత్తం మీద, రూ.102 కోట్ల విలువైన బంగారం అక్రమ రవాణా ఆరోపణలు, అంతర్జాతీయ లింకులు, మనీలాండరింగ్ అంశాలన్నీ కలిపి ఈ కేసును దేశవ్యాప్తంగా ప్రాధాన్యమైన ఆర్థిక నేరాల జాబితాలో నిలబెట్టాయి. రాబోయే రోజుల్లో కోర్టు విచారణలో ఈ వ్యవహారంపై మరిన్ని విషయాలు బయటపడనున్నాయి.

# యశ్ ఫ్యాన్స్ టెన్షన్.. మరీ ఇంత తక్కువనా?



కన్నడ సినీ ప్రేక్షకులు మాత్రమే కాకుండా పాన్ ఇండియా సినీ ప్రేమికులు, యాక్షన్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు 'టాక్సిక్' సినిమా కోసం ఎదురు చూస్తున్నారు. కేజీఎఫ్ సినిమా తర్వాత యశ్ నుంచి రాబోతున్న సినిమా కావడంతో పాన్ ఇండియా రేంజ్‌లో క్రేజ్ ఉంది అనడంలో సందేహం లేదు. దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను భారీ ఎత్తున విడుదల చేయడం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. మార్చి 19, 2026న భారీ ఎత్తున విడుదల కాబోతున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలు ఇప్పటికే మొదలు అయ్యాయి. గత ఏడాది కాలంగా అదుగో ఇదుగో అంటూ వాయిదా పడుతూ వచ్చింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కి గీతా మోహన్ దాస్ దర్శకత్వం వహించిన విషయం తెల్సిందే. టాక్సిక్ సినిమాను అన్ని భాషల్లోనూ భారీ మొత్తానికి బయ్యర్లు కొనుగోలు చేయడం జరిగింది. ఇటీవలే ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలకు రెడీ అయింది. సెన్సార్ కాపీ నిడివి ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ మధ్య కాలంలో పెద్ద హీరోల సినిమాలు ముఖ్యంగా పాన్ ఇండియా రేంజ్ సినిమాలు మూడు గంటలకు తగ్గకుండా నిడివితో వస్తున్నాయి. ఇక మీడియం రేంజ్ సినిమాలు సైతం 2 గంటల 45 నిమిషాల నిడివితో వస్తున్నాయి. కానీ ఇంత భారీ బడ్జెట్ సినిమా, పాన్ ఇండియా సినిమా అంటూ ప్రచారం జరుగుతున్న టాక్సిక్ సినిమా మాత్రం కేవలం 2 గంటల 20 నిమిషాల నిడివితో రాబోతున్నట్లుగా కన్నడ మీడియా సర్కిల్స్ నుంచి సమాచారం అందుతోంది. ఈ మధ్య కాలంలో వస్తున్న సినిమాలతో పోల్చితే దాదాపు అరగంట నిడివి తక్కువతో ఈ సినిమా రాబోతుంది. దాంతో యశ్ అభిమానులు టెన్షన్ పడుతున్నారు. భారీ యాక్షన్ సినిమా అంటున్నారు, పెద్ద స్టార్ కాస్ట్ మూవీ అన్నారు, మరి ఇంత తక్కువ రన్ టైమ్ సరిపోయేనా అంటూ ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా ఒక సినిమాను రెండు పార్ట్‌లుగా విడుదల చేస్తే అప్పుడు ఈ రన్ టైమ్‌తో వచ్చినా పర్వాలేదు. కానీ టాక్సిక్ సినిమా రెండు పార్ట్‌లుగా రాబోతుంది అనే విషయాన్ని ఇప్పటి వరకు మేకర్స్ ఎక్కడ కూడా చెప్పలేదు. కనుక టాక్సిక్ సింగిల్ పార్ట్ మూవీ అన్నట్లుగానే ప్రచారం జరుగుతోంది. అలాంటప్పుడు ఎలా ఈ తక్కువ నిడివితో మొత్తం కథ చెబుతారు, అందులోనూ భారీ యాక్షన్ సీన్స్‌ను ఎలా పెడుతారు అంటూ ఫ్యాన్స్‌తో పాటు రెగ్యులర్ ప్రేక్షకులు ప్రశ్నిస్తున్నారు. మొదటి నుంచి ఒక వర్గం ప్రేక్షకుల్లో ఈ సినిమాపై అనుమానాలు ఉన్నాయి. దర్శకురాలు గీతూ మోహన్ దాస్‌కి ఏ మేరకు యశ్‌ను హ్యాండిల్ చేసే సత్తా ఉంది అనే విషయంలో పలువురు పలు రకాలుగా కామెంట్స్ చేస్తూ వచ్చారు. తీరా సినిమా విడుదలకు సిద్ధం అయిన సమయంలో రన్ టైమ్ విషయంలో దర్శకురాలు అందరికి షాక్ ఇచ్చింది. టాక్సిక్ సినిమాలో నయనతార, కియారా అద్వానీ , హుమా ఖురేషి, తారా సుతారియా వంటి ప్రముఖ నటీనటులు నటించారు. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతాన్ని అందించారు. ఈ చిత్రాన్ని వెంకట్ కె.నారాయణ, యష్ సంయుక్తంగా కెవిఎన్ ప్రొడక్షన్స్ - మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్‌లో నిర్మించారు. యశ్ కేజీఎఫ్ తర్వాత చేసిన మొదటి సినిమా ఇదే కావడంతో ఇప్పటికే ప్రీ రిలీజ్ బిజినెస్ భారీగా జరిగింది.

థియేట్రికల్ రైట్స్‌తో పాటు, ఓటీటీ రైట్స్ ద్వారా వచ్చిన మొత్తంతో నిర్మాతలు లాభాల్లో పడ్డారనే వార్తలు వస్తున్నాయి. యశ్ ఈ సినిమాతో తన ఖాతాలో ఏకంగా రూ.200 కోట్లు వేసుకునే అవకాశాలు ఉన్నాయి అనేది ఇండస్ట్రీ వర్గాల్లో ఉన్న టాక్. మొత్తానికి టాక్సిక్ సినిమాపై ఉన్న అంచనాలు అంతా ఇంతా కాదు. కానీ సినిమా రన్ టైమ్ చూస్తే మాత్రం మీడియం రేంజ్ సినిమా కంటే తక్కువ ఉంది. కథ పూర్తిగా చెప్పకుండా చివర్లో పార్ట్ 2 ఉందని అందరిని యశ్ సర్‌ప్రైజ్ చేసేనా ఏంటో అనేది చూడాలి.

# ది కేరళ స్టోరీ 2 మూవీపై స్టే.. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉందంటూ!




సినిమా థియేటర్లలోకి రావడానికి సరిగ్గా ఒక్కరోజు ముందు 'ది కేరళ స్టోరీ 2' చిత్రానికి కేరళ హైకోర్టులో భారీ షాక్ తగిలింది. ఈ సినిమాలో మతపరమైన ఉద్రిక్తతలు పెంచేలా, ఒక వర్గాన్ని కించపరిచేలా దృశ్యాలు ఉన్నాయన్న పిటిషన్లను కోర్టు సీరియస్‌గా తీసుకుంది. స్వయంగా సినిమాను వీక్షించిన న్యాయస్థానం, వివాదాస్పద అంశాల దృష్ట్యా విడుదలపై స్టే విధించింది. సెన్సార్ బోర్డు తీరును తప్పుబడుతూ, ఈ చిత్రాన్ని మరోసారి పునఃపరిశీలించాలని ఆదేశించింది. వివరాలలోకి వెళితే...ఆఖరి నిమిషంలో హైకోర్టు బ్రేక్: ఫిబ్రవరి 27న భారీ అంచనాల మధ్య విడుదల కావాల్సిన 'ది కేరళ స్టోరీ 2- గోస్ బియాండ్' చిత్రానికి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ఈ సినిమా కేరళ రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందని, సమాజంలో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉందంటూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ కురియన్ థామస్ విచారణ చేపట్టారు. సినిమాను స్వయంగా చూసిన తర్వాతే నిర్ణయం చెబుతామని ప్రకటించిన కోర్టు, చివరకు స్టే విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. అసలు సినిమా చూడకుండానే జదీఖీజ (సెన్సార్ బోర్డు) ఎలా సర్టిఫికెట్ ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. చిత్రాన్ని మళ్లీ పరిశీలించి, అభ్యంతరకరమైన అంశాలపై నివేదిక ఇచ్చే వరకు థియేటర్లలో ప్రదర్శించకూడదని గట్టిగా ఆదేశించింది. 2023లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా ఈ సినిమాను విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. మొదటి భాగంలో కేరళ అమ్మాయిలు ఉగ్రవాద రొంపిలోకి ఎలా దింపబడ్డారో చూపించగా, ఈ రెండో భాగంలో ప్రేమ పేరుతో జరిగే మోసాలను మరింత లోతుగా చూపించే ప్రయత్నం చేశారు. ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీలో.. అల్లారుముద్దుగా పెరిగిన అమ్మాయిలు ప్రేమ మాయలో పడి, కన్నవారిని ఎదిరించి వెళ్లిపోవడం, ఆ తర్వాత ఎదుర్కొనే భయానక హింసను కథాంశంగా తీసుకున్నారు. అయితే, ఈ చిత్రీకరణ కేరళలో శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తుందని సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

కామాఖ్యా నారాయణ్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం, ట్రైలర్స్ నుంచే వివాదాలకు కేంద్ర బిందువైంది. ఒక వర్గం వారు ఇది వాస్తవమని వాదిస్తుంటే, మరికొందరు కావాలనే మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం అని మండిపడుతున్నారు. ఇక ప్రస్తుతం హైకోర్టు విధించిన స్టేతో చిత్ర బృందం డైలమాలో పడింది. సెన్సార్ బోర్డు ఈ సినిమాను మళ్లీ చూసి ఎలాంటి కటింగ్స్ ఇస్తుంది? కోర్టు అభ్యంతరాలను నిర్మాత ఎలా పరిష్కరిస్తారు? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇక ఏది ఏమైనా, కేరళ స్టోరీ పార్ట్-1 లాగే పార్ట్-2 కూడా బాక్సాఫీస్ వద్దకు రాకముందే దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

# ఫ్యాషన్ వీక్‌లో సందడి చేసిన శ్రీలీల!





సినీ తారలు ఒకవైపు సినిమాలలో నటిస్తూ.. తమ అద్భుతమైన నటనతో ప్రేక్షకులలో ఒక గుర్తింపును సొంతం చేసుకుంటూనే.. మరొకవైపు అంతర్జాతీయ వేదికలపై తమ ఫ్యాషన్స్ తో అందరి దృష్టిని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ప్రియాంక చోప్రాను మొదలుకొని యంగ్ బ్యూటీల వరకు ఎంతో మంది అంతర్జాతీయ ఫ్యాషన్ వేదికలపై కనిపించి.. తమ ఉనికిని చాటుకున్న ఈ ముద్దుగుమ్మలు.. ఇప్పుడు ఒక్కొక్కరుగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇండియన్ నటిగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీ లీల తాజాగా ఇటలీలో జరిగిన అత్యంత ప్రతిష్టాత్మక మిలన్ ఫ్యాషన్ వీక్ లో తన అద్భుతమైన డ్రెస్ సెన్స్‌తో అందరి హృదయాలను ఆకట్టుకుంది. మైసన్ మార్గీలా, చీ21 వంటి డిజైన్ హౌసులు అద్భుతంగా రూపొందించిన క్లాసిక్ దుస్తులతో కనిపించి సందడి చేసింది. ఒనిట్సుకా టైగర్ లో ముందు వరసలో నిలిచిన ఈమె మేరీ జేమ్స్‌తో జత చేసిన ఎల్లో కలర్ ట్వీడ్ జాకెట్ ధరించి అందరిని ఆకట్టుకుంది. పైగా జీన్స్ షార్ట్‌తో తన అందాలను ఫుల్ ఫిల్ చేసింది.

మొత్తానికైతే మిలన్ ఫ్యాషన్ వీక్‌లో సందడి చేసి అందరి దృష్టిని ఆకట్టుకోవడమే కాకుండా అంతర్జాతీయ వేదికలపై తన ఉనికిని చాటుకుంటూ ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది శ్రీ లీల. పెళ్లి సందడి సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత ధమాకా సినిమాతో ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది.. తన అద్భుతమైన నటనతో స్పెషల్ సాంగులతో ఉర్రూతలూగించే శ్రీ లీల గత కొన్ని రోజులుగా సరైన సక్సెస్ కోసం ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. తెలుగులో చివరిగా మాస్ జాతర అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈమె..పరాశక్తి సినిమాతో తమిళ అరంగేట్రం చేసింది కానీ ఈ సినిమా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. ఇక ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్ సరసన తూ మేరీ జిందగీ హై అనే సినిమాలో హీరోయిన్గా నటిస్తోంది. పైగా ఈ సినిమాతో హిందీ రంగ ప్రవేశం చేస్తుంది ఈ ముద్దుగుమ్మ. అలాగే ధనుష్ 55వ చిత్రంతో పాటు అజిత్ కుమార్ నటించే సినిమాలో అవకాశం అందుకుందిూశ్రీంశీ =ఘుస - ఓటీటీ భయం..ప్రొడ్యూసర్స్ సీరియస్‌గా తీసుకుంటారా? ఆశలన్నీ పవన్ కళ్యాణ్ సినిమా పైనే.. తెలుగులో హరీష్ శంకర్ దర్శకత్వంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో హీరోయిన్గా నటిస్తోంది. ఈమెతో పాటు ఇందులో ప్రముఖ హీరోయిన్ రాశీ ఖన్నా కూడా ఇందులో కీలకపాత్ర పోషిస్తుంది. భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ సినిమాపైనే శ్రీ లీల అంచనాలు పెట్టుకుంది. ఈ సినిమాతో గట్టి కంబ్యాక్ ఇవ్వాలని కోరుకుంటున్న ఈమెకు ఈ సినిమా ఎలాంటి సక్సెస్ అందిస్తుందో చూడాలి.

# వేసవిలో నీటి ఎద్దడి సమస్య ఉండరాదు

**- ఒక్కగ్రామానికి కూడా నీటి ట్యాంకర్ల అవసరం రాకూడదు - క్రాష్ సమీక్షలో జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి - బోర్ వెల్స్, మోటార్లు మరమ్మతులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి - సమస్య ఉత్పన్నమైతే తక్షణమే స్పందించాలి - పాఠశాలలు, వసతి గృహాలలో నీటి లభ్యతపై దృష్టి సారించండి**

**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** రానున్న వేసవిని దృష్ట్యా జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా వ్యవస్థలో ఎలాంటి అంతరాయం కలగకుండా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతీ గ్రామంలో క్రాష్ ప్రోగ్రాం జరగాలని, ఒక్క గ్రామానికి కూడా నీటి ట్యాంకర్ అవసరం రాకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామంతో పాటు ప్రతి పాఠశాల, వసతి గృహాల్లో కూడా వేసవిలో తాగునీటి సమస్యలు ఉండరాదని కలెక్టర్ తేల్చి చెప్పారు. అధికారాన్ని భారంగా కాకుండా, బాధ్యతగా స్వీకరిస్తే అన్ని పనులు సులభంగా చేయవచ్చని సూచించారు. బుధవారం సంబంధిత శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులతో పలు అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఉన్న బోర్ వెల్స్, ట్యాంకులు, పైప్ లైన్లను తనిఖీ చేయాలని, మోటార్లు, పంపుసెట్లు అకస్మాత్తుగా పాడవకుండా ముందస్తుగా సర్వీసింగ్ చేయించాలని తెలిపారు. ఒకవేళ మోటార్లు కాలిపోయినా లేదా సాంకేతిక సమస్యలు తలెత్తినా, యుద్ధప్రాతిపదికన వాటిని బాగు చేయించాలని ఆదేశించారు. ఎక్కడైనా నీటి సమస్య తలెత్తినట్లు ఫిర్యాదు అందితే, తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం అదనపు మోటార్లు, పైపులు ఇతర



సామగ్రిని మండల కేంద్రాల్లో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. మోటార్లు, విద్యుత్ పనులు చేపట్టేందుకు అధిక మొత్తంలో చెల్లింపులు చేయకుండా, జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన బృందాలతో నిర్ణయించిన ధరలకు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్లను ఆదేశించారు. ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగకూడదని, క్షేత్రస్థాయి అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తూ, నీటి ఎద్దడి లేకుండా చూడటమే ప్రథమ ప్రాధాన్యతగా పనిచేయాలని తేల్చిచెప్పారు. నీరు కలుషితం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఎంపీడీఓ గ్రామ సర్పంచులు లేదా కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసుకుని, గ్రామ సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండలంలో కచ్చితంగా ఒక గ్రామం ముస్తాబు కావాలని, ఆ గ్రామంతో పాటు కుటుంబం, పాఠశాలలు ముస్తాబు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం మనం కోరుకున్నట్లు మారాలని, ఆ దిశగా ప్రజలను ఉత్తేజపరచి తీర్చిదిద్దాలని అన్నారు. పాఠశాలలు, గ్రామం ఆహ్లాదంగా, అందంగా కనిపించేలా ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. ముస్తాబు గ్రామంతో మరికొన్ని గ్రామాలకు స్ఫూర్తిదాయకం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో బహిరంగ మల విసర్జన ఉండరాదని, ఈ విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని అన్నారు. బహిరంగ మల విసర్జన సామాజిక దురాచారమని ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ కచ్చితంగా మరుగుదొడ్లను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతీ పంచాయతీలో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, తద్వారా గ్రామంలో మరుగుదొడ్లు లేనివారు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. స్థల సమస్యలు ఉన్న చోట ప్రత్యామ్నాయ స్థలాలను చూపాలని సూచించారు. మండలంలో ఉల్లాస్ బాగా జరగాలని, ఉల్లాస్ మరియు 10వ తరగతి విద్యార్థులు అందరూ కచ్చితంగా శత శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ఎంపీడీఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని అన్నారు. అలాగే పీ4, స్వామిత్వా, ఫ్యామిలీ సర్వే, అటెండెన్స్‌లో వెనుకంజ ఉండరాదని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని పారామీటర్స్‌లో జిల్లా ముందంజలో ఉండాలని, వెనుకంజలో ఉన్న వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేక అధికారులు పల్లె నిద్ర చేసి, గ్రామ సమస్యలను తెలుసుకుని, పరిష్కరించాలని అన్నారు. ఫ్యామిలీ సర్వే శత శాతం జరగాలని, అలాగే పి4 పూర్తి చేయాలని తెలిపారు. దేశంలో మార్ట్ కింద ఎంపిక చేసిన 7 జిల్లాల్లో మన్యం జిల్లా ఎంపికైందని, ఈ కార్యక్రమంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మారనున్నాయని అన్నారు. అలాగే ఐటీడీఏ పరిధిలోని గ్రామాల అభివృద్ధిలో భాగంగా దేశావ్యాప్తంగా 1,000 గ్రామాలు ఎంపిక కాగా, అందులో రాష్టంలో 75 గ్రామాలు, జిల్లాలో 5 గ్రామాలు ఎంపిక కావడం శుభదాయకం అని అన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు కూడా జిల్లాను ముందంజలో ఉంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పార్వతీపురం పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు, ఈఈలు, ఏఈలు ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# "వక్త" పోటీలలో విజేతలకు నగదు పురస్కారాలు




**విజయనగరం, (రాజధాని వార్తలు):** మూఢనమ్మకాల నిర్మూలన, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణ, మరియు విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని కల్పించడం వంటి లక్ష్యాలతో అనునిత్యం కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదిక విజయనగరం జిల్లాలో విద్యార్థుల్లో నిబిడీకృతమైన శక్తి సామర్థ్యాలను వెలికి తీస్తోంది. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడమే ముఖ్య లక్ష్యంగా వక్త పోటీలను నిర్వహించినట్లు జనవిజ్ఞాన వేదిక జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎరుకొండ ఆనంద్, డాక్టర్ మిరియాల కృష్ణారావు పేర్కొన్నారు. గురజాడ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వక్త పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యం.వి. ఆర్ కృష్ణాజీ నాయకత్వంలో పాఠశాలలు, కళాశాలల స్థాయిలో వక్త పోటీలు నిర్వహించి, ఇందులో విజేతలు నిలచిన వారికి మండల స్థాయిలో పోటీలు నిర్వహించిన తరువాత ఇందులో విజేతలుగా నిలిచిన వారికి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీలలో కళాశాల స్థాయిలో ప్రథమ విజేతగా నిలిచిన ఎం.డి. అయేషాకు (డైట్ కళాశాల, వేణుగోపాలపురం) 5 వేల రూపాయలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఆర్.సాయి దీపిక (విజయనగరం ఆదిత్య ఉమెన్స్ కళాశాల) 3 వేల రూపాయలు, తృతీయ స్థానంలో నిలిచిన బి.శర్వాణి (చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల) 2 వేల రూపాయలు నగదు బహుమతిని, ప్రశంసాపత్రాలను అందజేశారు. అదేవిధంగా పాఠశాల స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి - ఏ. జాహ్నవి (గజపతినగరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల), ద్వితీయ బహుమతి కే.లహరి (విజయనగరం గురజాడ స్కూల్) తృతీయ బహుమతి జి.హరి (మరుపల్లి మోడల్ స్కూల్) విజేతలుగా నిలిచారు. జిల్లాస్థాయిలో విజేతలగా నిలిచిన విద్యార్థులకు ఈ నెల 28న గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి వక్త పోటీల్లో పాల్గొంటారని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకుల గంట్రేటి లక్ష్మణరావు, గంట్రేటి అప్పలనాయుడు, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ పైల రమేష్ రాజు, జిల్లా కోశాధికారి షిణగం శివాజీ, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.తిరుపతిరావు, జాతీయ సాంస్కృతిక విభాగం కన్వీనర్ గంట్రేటి శ్రీనివాస్, జాతీయ విద్యా విభాగం నాయకులు, ఎస్.ఈశ్వరరావు, రాష్ట్ర యూత్ నాయకుల సెనపతి ఈశ్వరరావు, గురజాడ పాఠశాల కరస్పాండెంట్ ఏం.స్వరూప, బి.పోలినాయుడు, ప్రముఖ రచయిత సాహితీవేత్త, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కార గ్రహీత సముద్రాల గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి నీతి ఆయోగ్ పూర్తి సహకారం అందించాలి : జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి





**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** మన్యం జిల్లా అభివృద్ధికి నీతి ఆయోగ్ పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి కోరారు. నీతి ఆయోగ్ అధికార ప్రతినిధి ఆయుషి అగర్వాల్ బుధవారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డిని ఆయన ఛాంబరులో ఆమె కలిసి జిల్లా సమగ్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2047 నాటికి గ్రామాలను స్వయం సమృద్ధిగా, అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు రూపొందించిన 'విలేజ్ ప్లాన్ 2047' అమలు చేయాలని అన్నారు. మన్యం జిల్లాలోని ప్రతి గ్రామం అన్ని రంగాల్లో వృద్ధి సాధించేలా రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయడంపై దృష్టి సారించాలని కోరారు. జిల్లాలోని భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయం, ఉద్యానవన మరియు అనుబంధ రంగాలను బలోపేతం చేయడంపై చర్చించిన ఆయన రైతులకు మేలైన ఆదాయ వనరులను కల్పించే దిశగా అడుగులు వేయాలని నిర్ణయించారు. వ్యవసాయంతో పాటు ఇతర సేవా రంగాలలో ఆధునిక సాంకేతికతను, అంతర్జాతీయ ప్రమాణాలను తీసుకు రావడానికి నీతి ఆయోగ్ నుండి 'నాలెడ్జ్ పార్ట్‌నర్స్' మద్దతును అందించాలని ఆమె కలెక్టర్‌ను ఈ సందర్భంగా కోరారు.

నిపుణుల సలహాలతో జిల్లాలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. అభివృద్ధికి ఆటంకంగా ఉన్న పాత నిబంధనల్లో మార్పులు చేయడం, పారదర్శకమైన పాలనను అందించడం ద్వారా మన్యం జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సహకారం అందించాలని నీతి ఆయోగ్ ప్రతినిధికి జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ పర్యటనలో జిల్లా అధికారులు, నీతి ఆయోగ్ ప్రతినిధులు మరియు ఇతర విభాగాల ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# పిల్లల భద్రతే పరమావధిగా వాహనాన్ని నడపాలి

**- అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించాలి**
**- నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు**

**అమలాపురం, (రాజధాని వార్తలు):** పాఠశాల బస్సులకు అన్ని విధాల అర్హులైన డ్రైవర్‌లను మాత్రమే నియమిస్తూ పిల్లల భద్రత పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని జిల్లా రవాణా అధికారి డి శ్రీనివాసరావు పాఠశాల యాజమాన్యాలకు పేరెంట్ కమిటీలకు సూచించారు. బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో స్కూలు, కాలేజీ యజమానులు, విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలతో పోలీసు రవాణా విద్యా శాఖల సంయుక్త సమావేశం బడుగుల భద్రతా బాధ్యతా అంశంపై నిర్వహించారు. డి టి ఓ ప్రసంగిస్తూ పిల్లల భద్రత మొదటి ప్రధాన బాధ్యతగా తీసుకోవాలి బస్సు భద్రతా నిబంధనలు పూర్తి ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో ఉండాలన్నారు. బ్రేకులు, టైర్లు, లైట్లు అన్నీ సరిగ్గా పనిచేయాలన్నారు. అత్యవసర ద్వారాలు, అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. సహాయక సిబ్బంది (అసిస్టెంట్), ఫస్ట్ ఎయిడ్ కిట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. డ్రైవర్లు, యాజమాన్యాల బాధ్యతలపై సమీక్షిస్తూ విద్యా సంస్థలు అనుభవజ్ఞులైన డ్రైవర్లను మాత్రమే నియమించాలని అతివేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరిమితిని మించి ఎక్కువ పిల్లలతో నడిపినా, రవాణా శాఖ నిబంధనలు ఉల్లంఘించినా బస్సు సీజ్ చేసి, జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. తల్లి దండ్రుల సహకారం పిల్లలు బస్సు ఎక్కే ఇంటికి వచ్చే సమయంలో పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రభుత్వ మోటార్ వాహనాల చట్టం 185 జి లోని 32 నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాల న్నారు. 40 మంది పిల్లలు ప్రాణాలు డ్రైవర్ చేతిలో ఉంటాయన్నారు. 2011 మోటార్ వాహనాల చట్టాన్ని తప్పనిసరిగా పాటించాలన్నారు. బడి బస్సు పిల్లలను ఇంటి నుంచి పాఠశాలకు, పాఠశాల నుంచి ఇంటికి సురక్షితంగా తీసుకెళ్లే ముఖ్యమైన వాహనం




అన్నారు. అందువల్ల బస్సు భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వేగం పరిమితిని మించకూడదన్నారు. పిల్లలు ఎక్కే/దిగే సమయంలో పూర్తిగా ఆపి జాగ్రత్తగా చూడాలన్నారు. వాహనం ఫిట్‌నెస్, బ్రేకులు, సిగ్నల్స్ సరిగా ఉన్నాయో చూసుకోవాలన్నారు. బస్సులో సహాయకుడు అటెండర్ ఉండేలా చూడాలన్నారు. సీసీటీవీ, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. బస్సులో పిల్లలు కిటికీ బయటకు తల, చేతులు పెట్టకుండా చూడాలన్నారు. రవాణా శాఖ ప్రతి సంవత్సరం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి బస్సుల ఫిట్‌నెస్, అత్యవసర ద్వారాలు, అగ్నిమాపక పరికరాలు తనిఖీలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రసాద్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్‌లు రాజేంద్రప్రసాద్, వంశీధర్, పాఠశాల యజమాన్యాలు, పోలీస్ రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఈనెల 28వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చీపురుపల్లి మండలం రావివలస సమీపంలో పైలపేట వద్ద పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి రానున్న నేపథ్యంలో బుధవారం సభా స్థలాన్ని పరిశీలించి, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేసారు. ముఖ్యమంత్రి రాబోయే పర్యటన సందర్భంగా ఏర్పాట్లు జరుగుతున్న స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్ ప్రాంగణంలో వేదిక నిర్మాణం, కూర్చోవడానికి ఏర్పాటు చేస్తున్న సదుపాయాలు, పార్కింగ్ స్థలాలు, త్రాగునీరు మరియు పారిశుధ్య ఏర్పాట్లను సమీక్షించారు. భద్రతా పరమైన చర్యలపై పోలీస్ అధికారులతో చర్చించి, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వేదిక వద్ద వైద్య శిబిరం, అగ్నిమాపక సదుపాయాలు, విద్యుత్ సరఫరా వంటి అంశాలలో పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో జేసీ సేధు మాధవన్, చీపురుపల్లి ఆర్డీవో ప్రమీల గాంధీ, డిఆర్డిఎ పిడి శ్రీనివాస్ పణి, రెవెన్యూ, పోలీసు, మండల అధికారులు, కూటమి పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దళితుల భూముల్లోనికి వెళ్లకుండా అడ్డుకున్న వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

## - సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్



**అల్లవరం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం తుమ్మల పల్లి గ్రామానికి చెందిన పలు దళిత కుటుంబాలకు కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలో కేటాయించిన భూములలోనికి వెళ్లకుండా అడ్డుకున్న భూస్వాములపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. 1970వ దశకంలో ప్రభుత్వం 6 నిరుపేద దళిత కుటుంబాలకు సాగు నిమిత్తం భూములను కేటాయించారు. కొమరగిరిపట్నానికి చెందిన కదలి శ్రీనివాసు (లాయర్ శ్రీను), గుత్తుల నాగరాజు, గుత్తుల దుర్గారావు తదితర భూస్వాములు ఆ భూములపై కన్నేసి ఆక్రమించుకోవాలనే ప్రయత్నంలో భూ యజమానులైన దళితులను ఆ భూములలోనికి రాకుండా అడ్డుకొని దుర్భాషలాడి దాడికి ప్రయత్నించారని వెంకటేశ్వరరావు ఆరోపించారు. బుధవారం తమ భూములలో సాగు చేసుకోవటానికి వెళ్లిన బల్ల శ్రీనివాసరావు, కుంచె రెడ్డిబాబు అనే దళిత యువకులపై భూస్వాములు కర్కశంగా దాడికి ప్రయత్నించటం దారుణమని యువకులపై దాడి జరుగుతుండగా అడ్డుకోవడానికి వెళ్లిన వడ్డీ ఆదిలక్ష్మి, యలమంచిలి మణి, చింతా దేవి అనే దళిత మహిళలను కూడా వదలకుండా కులం పేరుతో దూషించడాన్ని సిపిఎం పార్టీ మరియు వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దళిత మహిళలను అవమానించి, యువకులపై హత్యా యత్నానికి పాల్పడిన కదలి శ్రీనివాసు, గుత్తుల నాగరాజు, గుత్తుల దుర్గారావు తదితర నిందితులపై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు కేటాయించిన భూములకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించి, ఆక్రమణదారుల నుండి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. బాధితులకు అక్రమణ దారులు నుండి ప్రాణహాని ఉందని తగిన పోలీసు రక్షణ కల్పించాలి. లేకుంటే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చింతా వెంకటరమణ, యలమంచిలి మోహనరావు, చింతా వీర ప్రసాద్, యలమంచిలి రమేష్, చింతా రాధాకృష్ణ, వడ్డి ఆదిలక్ష్మి, బల్ల సూర్య కుమారి, బల్ల నాగదుర్గ, చింతా దేవి, యలమంచిలి మణి, బల్ల శ్రీను, యలమంచిలి శ్రీను, కుంచె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు మీడియా సహకరించాలి : ఎస్సై




**దొరవారిసత్రం, (రాజధాని వార్తలు):** దొరవారిసత్రం మండలం పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై గరికపాటి వెంకటేశ్వర చౌదరి బుధవారం పోలీస్ స్టేషన్‌నందు మీడియా సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు మీడియా వారు కూడా మాకు సహకరిం చాలన్నారు. మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగ కుండా చూస్తానన్నారు. మీడియా దృష్టికి వచ్చిన ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలనైనా మా దృష్టికి తీసుకువస్తే మేము వెంటనే చర్యలు తీసుకుంటామని, అలాగే హైవేల మీద ప్రమాదాలు జరిగినప్పుడు మొదట గంట గోల్డెన్ అవర్‌లో బాధితులను హాస్పిటల్‌కు చేర్చగలిగితే వారి ప్రాణాలను రక్షించవచ్చు అని అందుకు రెండు మొబైల్ వాహనాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. హైవేలపై, పాఠశాలలు దగ్గర పోలీస్ సిబ్బందిని ఉంచుతున్నామని, రాత్రిపూట గస్తీ నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ సైబర్ మోసాలకు లోను కాకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తానని, అలాగే మహిళల రక్షణ కోసం ప్రభుత్వం శక్తి మొబైల్ యాప్‌ను తీసుకు వచ్చిందని, ఈ యాప్‌ను మహిళలే కాకుండా పురుషులు కూడా దీన్ని ఉపయోగించవచ్చని దీని ద్వారా పోలీసులకు సమాచారం త్వరగా తెలుస్తుందని మీడియా వారు కూడా సహకరించాలని కోరారు.

# అద్దెపూడి గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించాలి

## - రెవెన్యూ మంత్రిని కోరిన ఎమ్మెల్యే సునీల్ కుమార్



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు నియోజకవర్గ పరిధిలోని చిట్టమూరు మండలం అద్దెపూడి గ్రామంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను గూడూరు ఎమ్మెల్యే పాశిం కుమార్ కలిసి వినతిపత్రం అందించారు. జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిట్టమూరు మండలం అద్దెపూడి గ్రామం హరిజనవాడనందు ప్రజలు సుమారుగా 60 సంవత్సరాలుగా చెరువు పోరంబోకు భూమి నందు నివసిస్తున్నారని, వారంత ఇల్లు నిర్మించుకుని అన్ని సౌకర్యాలతో జీవనోపాధి సాగిస్తున్నారని, చెరువు పోరంబోకుగా ఉన్న సర్వే నంబర్‌ను క్రమబద్ధీకరణ చేసి ప్రత్యేక సర్వే నంబర్‌ను కేటాయించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

# ఆటో వర్కర్స్ యూనియన్ మహాసభలను జయప్రదం చేయండి




**వరదయ్యపాలెం, (రాజధాని వార్తలు):** వరదయ్యపాలెం బస్సు స్టాండ్ వద్ద యూనియన్ అధ్యక్షులు ఆంబాకం చిన్ని రాజ్ ఏఐటియూసి నాయకులు చంద్ర ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది తిరుపతి జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అనుబంధం రెండవ మహాసభలను మార్చి 1వ తేదీ ఆదివారం తిరుపతిలో జరుగుతాయని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షులు చిన్ని రాజు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో రవాణా రంగంలో సుమారు లక్ష ఆటోలు ఉన్నాయని లక్ష 25 వేల ఆటో కార్మికులు ఉన్నారని ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని. ఆటో మోటార్ కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ ఏర్పాటు చేయాలని చిన్ని రాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఆటో డ్రైవర్‌కు 15 వేల రూపాయలు ఇవ్వాలని, ఆటో డ్రైవర్లకు 60 సంవత్సరాలు పైబడిన వారికి పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని ప్రమా దకరంగా ఉన్న రోడ్లను బాగు చేసి ప్రమాదాలు నివారించాలని ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీఓ నంబర్ 21, 31 వెంటనే రద్దు చేయాలని, ప్రధాన కోడళ్ళ వద్ద ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని చిన్ని రాజు డిమాండ్ చేశారు. ఏ ఐ టి యు సి సత్యవేడు నియోజకవర్గం కార్యదర్శి మాట్లాడుతూ ఆటో కార్మికుల కుటుంబాలకు హెల్త్ కార్డులు ఇచ్చి ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలి. పెట్రోల్ డీజిల్ పిఎన్జి గ్యాస్ ధరలను జీఎస్టీలో చేర్చాలని అధిక ధరలు తగ్గించి ఆటో కార్మికులను ఆదుకోవాలని ఆటో కార్మికులకు వాహనాలు కొనుగోలుకు 0 వడ్డీకే బ్యాంకు కల్పించాలని చంద్ర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ముని రాజా, కుమార్, వెంకటేశ్వర్లు, గుమ్మడి వెంకటేశ్వర్లు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు సముదాయ నిర్మాణ భూమి పూజ ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి



**తిరుపతి, (రాజధాని వార్తలు):** జిల్లా కోర్టు సముదాయ నిర్మాణానికి సంబంధించి భూమి పూజ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం దామినేడు సమీపంలో మార్చి ఒకటవ తేదీన జిల్లా కోర్టు సముదాయ నిర్మాణానికి నిర్వహించనున్న భూమి పూజ కార్యక్రమం సందర్భంగా ముందస్తు ఏర్పాట్లను తిరుపతి జిల్లా మూడవ అదనపు జడ్జి ఎం.గురునాథ్, జిల్లా ఎస్పి ఎల్.సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు తదితర అధికారులతో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థల విస్తీర్ణం, రహదారి సౌకర్యం, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలు, విద్యుత్ మరియు తాగునీటి సదుపాయాలు వంటి అంశాలను అధికారులతో సమీక్షించారు. భూమి పూజ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసే గౌరవ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర అతిథులు, న్యాయవాదులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లాలో న్యాయ సేవలను మరింత బలోపేతం చేయడంలో ఈ కోర్టు సముదాయ నిర్మాణం కీలక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, ఏఎస్పి రవి మనోహర్ ఆచారి, తుడా ఎస్ ఈ రవీంద్ర, డీఎస్పీలు, రెవెన్యూ, పోలీస్, ఆర్ & బి, విద్యుత్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీరాముల వారి కుంభాభిషేక కార్యక్రమంలో ఉన్నం వాసుదేవ నాయుడు దంపతులు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయతీ తాటిపర్తి దళితవాడలో శ్రీ శ్రీరాముల వారి కుంభభిషేకం కార్యక్రమానికి గ్రామస్తులు ఆహ్వానం మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, వారి సతీమణి మండల ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వాసుదేవ నాయుడు దంపతులు, స్వామి వారి పూజలు పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం గ్రామస్తులు అష్ట ఆయురోగ్యాలతో సంతోషంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు సర్పంచ్ నాగేంద్ర, తాటిపర్తి గ్రామస్తులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఖర్గేని కలిసిన జగ్గారెడ్డి.. అసలు విషయమిదే...



**ఢిల్లీ:** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను.. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు. ఖర్గేతో ఆయన పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాలపై సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కూడా ఈ విషయంపై మాట్లాడానని, వి.హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి రాజ్యసభ ఇవ్వాలని కోరానని అన్నారు. ఇదే విషయంపై రాహుల్ గాంధీని, మల్లికార్జున్ ఖర్గేని కలవడానికి ఢిల్లీకి వచ్చానని తెలిపారు. రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారని చెప్పుకొచ్చారు. వి. హనుమంత రావు. జెట్టి కుసుమ కుమార్‌లకు రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని కోరానని తెలిపారు. జెట్టి కుసుమ కుమార్.. యూత్ కాంగ్రెస్ లీడర్‌గా, స్టూడెంట్ లీడర్‌గా.. కమ్మ సామాజిక వర్గం నుంచి ఉన్నారని ప్రస్తావించారు. జెట్టి కుసుమ కుమార్ ఫ్యామిలీ ఫ్రీడమ్ ఫైటర్స్ అని, వాళ్ల కుటుంబం నుంచి అంతా కాంగ్రెస్‌లోనే ఉన్నారని గుర్తు చేశారు. హనుమంతరావు తెలంగాణలో అనేక మంది ముఖ్యమంత్రులతో పని చేశారని వెల్లడించారు. మూడు సార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారని చెప్పుకొచ్చారు. ఆయనకు రాజీవ్ గాంధీ, సోనియాగాంధీ అవకాశాలు ఇచ్చారని తెలిపారు. వి.హనుమంతరావు చురుకైన వ్యక్తి అని, ఆయనకు మరోసారి రాజ్యసభకు అవకాశం ఇవ్వాలని ఖర్గేను కోరానని అన్నారు. కమిటీలో చర్చిస్తామని ఖర్గే హామీ ఇచ్చారని తెలిపారు. రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ




**తిరుపతి, (రాజధాని వార్తలు):** ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తం గా సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేపట్టడం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఐపీఎస్. బుధవారం తిరుపతిలో జరుగుతున్న పలు ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను స్వయంగా సందర్శించి, అక్కడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి పలు కీలక సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై కఠిన నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్ష సమయాల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలి అని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద గుంపులుగా నిలబడకుండా తగిన నియంత్రణ చర్యలు తీసుకోవాలి అని తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అవసరమైన భద్రతా వాతావరణం కల్పిం చాలి అని తెలిపారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పాస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

## RAJADHANIVARTALU.COM
## 9440662699

# సర్పవరం శ్రీ భావనారాయణ స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు

## - 130 రోజులకు రూ.10.50 లక్షల ఆదాయం





**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** సర్పవరం ప్రాంతంలో భక్తుల విశ్వాసానికి నిలయంగా వేంచేసి ఉన్న శ్రీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ భావనారాయణ స్వామివారి ఆలయం బుధవారం మరోసారి భక్తుల సందడి నడుమ హుండీ లెక్కిం పుకు వేదికైంది. ఆలయ ఆర్థిక పారదర్శకత కొరకు ప్రతి కొన్ని నెలలకు ఒకసారి నిర్వహించే హుండీ లెక్కింపును బుధవారం ఆలయ అధికారులు ఘనంగా చేపట్టారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉదయం నుంచే హుండీలు తెరిచి లెక్కింపు ప్రారంభమైంది. 130 రోజుల వ్యవధిలో భక్తులు సమర్పించిన విరాళాల వివరాలు...నగదు రూపంలో రూ. 8,93,290లు, చిల్లర నాణేలు రూ. 1,57,020లు కలిపి మొత్తం ఆదాయం రూ. 10,50,310లు, విదేశీ నోట్లు 3, వెండి, బంగారం వస్తువులు ఏమి రాలేదు. భక్తులు స్వామివారికి అంకిత భావంతో సమర్పించిన విరాళాలు దేవస్థాన అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు వినియోగించబడతాయని ఆలయ అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆర్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ భక్తుల శ్రద్ధాభక్తులు మా ఆలయ అభివృద్ధికి బలం అన్నారు. హుండీ లెక్కింపును పూర్తిగా నిల్వ పారదర్శకంగా ప్రతి విభాగం సమక్షంలో నిర్వహించడం మా కర్తవ్యంగా భావిస్తున్నాం అని పేర్కొన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమం సజావుగా, శాంతియుతంగా నిర్వహించబడిందని, ఆలయ అభివృద్దే ధ్యేయంగా తాను పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమానికి సిఎఫ్ఓ గ్రేడ్-1 ఈఓ ఎం ఎం వీరభద్రరావు నాయకత్వం వహించగా, గ్రామస్తులు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది, సేవా దళ కార్యకర్తలు, పోలీస్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, పత్రికా ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# భారీ వర్షంతో ప్రజలకు ఇబ్బందులు




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో బుధవారం సాయంత్రం ఆకస్మికంగా భారీ వర్షం పడింది. ఉదయం నుండి ఎండలతో ప్రజలు ఇబ్బందులకు గురికాగా సాయంత్రం వేళ ఒక్కసారిగా నల్లని మ్బబ్బులు కమ్ముకుని గాలి దుమారం ఏర్పడింది. అనంతరం భారీ వర్షం పడింది. వర్షం కారణంగా సామర్లకోట రైల్వే స్టేషన్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ప్రజలు ప్రయాణికులు బస్సులు చేరుకునే విషయంలో ఇబ్బందులకు గురయ్యారు. తుఫాను ప్రభావంతో కురిసిన వర్షంతో ప్రజలు సేదదీరారు.

# నిందుతుల అరెస్ట్ కోరుతూ డిఎస్పీకి వినతి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలం బోయినపూడి గ్రామంలో మాదిగ సామాజిక వర్గంపై అదే గ్రామానికి చెందిన కాపు సామాజిక వర్గానికి చెందినవారు చేసిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు తమకు న్యాయం చెయ్యాలని కోరుతూ పెద్దాపురం డిఎస్పి డి శ్రీహరిరాజుకు బుధవారం వినతపత్రాన్ని అందజేశారు. జనవరి 14వ తేదీన జరిగిన ఈ సంఘటనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు వారు కర్రలతో తిరుగుతూ మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారన్నారు. ఈ విషయంపై పోలీసు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పెద్దాపురం డిఎస్పికు వినతి పత్రాన్ని అందజేశారు. తొలుత డిఎస్పీ కార్యాలయం ఎదుట వారు ధర్నా నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎండిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లాయర్ కొండపల్లి ప్రసాద్, ఎంఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొండేపూడి ఉదయ్ కుమార్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గొడత విజయ కుమార్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మందపల్లి సత్యనారాయణ, బాధితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పాల విక్రయ కేంద్రాలలో ఆకస్మిక తనిఖీ



**తిరుపతి, (రాజధాని వార్తలు):** నగరంలోని అన్నారావు సర్కిల్ రిజర్వాయర్ రోడ్ ఇస్కాన్ రోడ్‌లో గల పలు ఆవు, గేదె పాల విక్రయ కేంద్రాలలో అకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగినది. జిల్లా ఆహార భద్రత అధికారి మద్దిలేటి మరియు జగదీష్, జాతీయ వినియోగదారుల సంఘాల సమైక్య ప్రతినిధి డాక్టర్ హరిబాబు, జిల్లా వినియోగదారుల సంఘ అధ్యక్షులు రాజారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించడం జరిగినది. వీటిని సాధారణ పరీక్షలైన, అయోడిన్‌తోను, సోయాబీన్ పౌడర్‌తోనూ జరిపిన పరీక్షలో ఒక షాపులో మాత్రం స్టాచ్ పౌడర్నీరు మరో షాప్‌లో నీరు కలిపినట్లు మా చిన్న పరిశీలనలో తెలిసింది, ప్రతి పాల విక్రయ కేంద్రంలో శాంపుల్స్ తీసుకొని సుక్షమ పరీక్షకు, రాష్ట్ర ఆహార భద్రతా, ప్రమాణాల, కల్తీ నిరోధక లేబరేటరీకి పంపించడం జరుగుతుంది. వీటితో పాటు కొన్నిచోట్ల నాణ్యతలేని, లేబులింగ్ లేని నెయ్యి, పన్నీరు, వెన్న, విక్రయిస్తున్నట్లు గుర్తించడం జరిగినది వీటి పైన చర్యలు తీసుకోవడం జరుగుతున్నది. ల్యాబ్ పరీక్షలో సురక్షితం కాకుండా, ఆరోగ్యానికి హాని కలిగించేవని ధ్రువీకరణ జరిగితే విక్రయదారులకు ఆహార భద్రత చట్ట ప్రకారము కోర్టులో లక్ష రూపాయలు నుంచి 5 లక్షల వరకు జరిమానా మరియు ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష విధింస్తారు, అటువంటి శిక్షలు కలిగినటువంటి ఈ చట్టాన్ని విక్రయదారులు అందరు గుర్తించుకొని వ్యవహరించాలి, వినియోగదారులకు న్యాయమైన పాలను సరఫరా చేయడానికి బాధ్యతతో కృషి చేయాలి, వినియోగదారులు కూడా అప్రమత్తంతో కేంద్రాలలో కాని, ఇంటికి తెచ్చే పాలు గాని నాణ్యమైనవా, కాదా అని అనుమానం వచ్చినప్పుడు జిల్లా ఆహార భద్రత అధికారికి గాని, జిల్లా వినియోగదారు సమాచార కేంద్రంకి గాని తెలియజేస్తే దాన్ని పరీక్షించి వివరంగా లోపాలను తెలియజేయగలరు. ఇది ప్రతి ఒక్క వినియోగదారు కూడా గుర్తుంచుకోవాలని తెలిపారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan